నక్షత్ర విస్ఫోటనాల ఆనవాళ్లవిగో!

అద్భుతాలను గుర్తించిన 'ఆస్ట్రోశాట్'

ఈనాడు కర్ణాటక

శనివారం అక్టోబరు 12, 2024



ఈనాడు, బెంగళూరు : నాసా అంతరిక్ష అబ్జర్వేటరీలతో కలిసి భారత్‌కు చెందిన అంతరిక్ష టెలిస్కోప్ 'ఆస్ట్రోశాట్' అంతరిక్షంలోని నక్షత్ర శకలాల విస్ఫోటనాలను గుర్తించింది. ఇస్రో గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం అంతరిక్షంలోని నక్షత్రాలు అక్కడి బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు) కారణంగా ఛిద్రమవుతూ శకలాలుగా సంచరిస్తాయి. ఇలా విడిపోయిన నక్షత్ర శకలాలు మళ్లీ బ్లాక్‌హోల్స్‌లో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తూ ఒకదానికి ఒకటి రాపిడికి గురై కొత్త కృష్ణబిలాలను తయారు చేస్తున్నట్లు నాసాకు చెందిన చంద్ర, హెచ్‌ఎస్‌టీ, ఎన్‌ఐసీఈఆర్, భారత్‌కు చెందిన ఆస్ట్రోశాట్ చిత్రీకరించాయి. ఈ టెలిస్కోప్‌లు గుర్తించిన విస్ఫోటనాలు ఖగోళశాస్త్రవేత్తలకు విలువైన సమాచారాన్ని అందించనున్నట్లు ఇస్రో నిపుణులు బెంగళూరులో వెల్లడించారు. ఐదేళ్ల కిందట ఖగోళశాస్త్రవేత్తలు కేవలం నక్షత్రం సంకేతాలను మాత్రమే గుర్తించగలిగారు. ఆ నక్షత్రాలు కొలనులో దూకేందుకు ప్రయత్నించే డైవర్స్ (ఈతగాళ్లు)లా మారి పదేపదే బ్లాక్‌హోల్స్‌లోనికి వెళ్లే ప్రయత్నం చేసి విస్ఫోటనానికి గురవుతూ వేరొక చోట కొత్తవి సృష్టిస్తున్నాయని గుర్తించారు. ప్రతి 48 గంటలకు ఓసారి నక్షత్ర శకలం ఈ ప్రయత్నం చేస్తున్నట్లు టెలిస్కోప్‌లోని ఎక్స్‌రే కిరణాల ద్వారా స్పష్టమైంది. ఈ పరిణామాలను ఖగోళశాస్త్రం ప్రకారం ఏటీ2019క్యూఐజెడ్‌గా పిలిచే టైడల్ డిస్ట్రప్షన్ ఈవెంట్ (టీడీఈ)లను గతంలో స్పష్టంగా గుర్తించలేకపోయారు. తాజాగా గుర్తించిన విషయాలన్నీ అంతరిక్షం ఎలా ఏర్పడిందో తెలుసుకునేందుకు ఓ అరుదైన అధ్యయనంగా ఉపయోగపడుతుందని మసాచూట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిపుణుడు ధీరజ్ పాశం తెలిపారు. నాసా టెలిస్కోప్‌లతో పాటు ఆస్ట్రోశాట్‌లో అమర్చిన సమర్థమంతమైన యూవీ, అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (యూవీఐటీ) ఏటీ2019క్యూఐజెడ్ మూలాన్ని గుర్తించాయని పుణెకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ నిపుణుడు, శాస్త్ర వ్యాసాల రచయిత గులాబ్ దేవాంగన్ తెలిపారు.

దసరా వేడుక.. రాజకీయ మరక



దసరా ప్రకటనకూ రాజకీయ రంగు

ఈనాడు, బెంగళూరు : కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన తర్వాత నిర్వహిస్తున్న రెండో దసరాకు ఆరోపణల మరకలంటుతున్నాయి. గతేడాది మే నెలలో అధికార పగ్గాలు అందుకున్న కాంగ్రెస్ సర్కారుకు తొలి దసరా కరవు కారణంగా ఇక్కట్లు ఎదురయ్యాయి. సంబరాలు సాధారణంగా కొనసాగించింది. ఆ ఏడాది నిరాడంబర దసరా ఆచరణకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి ఈసారి సంబరాల జోష్ పెంచారు. వేడుకల కోసమే రూ.15 కోట్ల అదనపు నిధులు ప్రకటించారు. అధికార యంత్రాంగం ఉత్సాహంతో కార్యక్రమాలను రూపొందించినా మంత్రివర్గం అంతగా ఆసక్తి లేనట్లే కనిపించింది. మైసూరులో నిర్వహించే అన్ని కార్యక్రమాలకూ ముఖ్యమంత్రితో సహా, ఇతర మంత్రులు హాజరవుతున్నా వారంతా అన్యమనస్కంగా కనిపిస్తున్నారు. చివరకు ఈ పండగ కోసం సర్కారు ఇచ్చిన పత్రికా ప్రకటన రాజకీయ విమర్శలకు వేదికగా మారింది.

'రాజకీయ' ప్రకటన

శుక్రవారం సర్కారు ఇచ్చిన పత్రికా ప్రకటన రాజకీయ దుమారం రేపింది. ఈ ప్రకటనలో దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు దసరా ప్రతీక.. దుష్ట శక్తిపై సత్యానికి జయం, వక్రమార్గంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నించే దుష్ట శక్తులను తల్లి చాముండేశ్వరి నిలువరించి కన్నడ ప్రజలకు సుఖ, శాంతులు అందించాలని ఈ ప్రకటన సారాంశం. అందులోనూ భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక పరంపరలో ఒకటైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాజిక అలజడి సృష్టించే వారిని శిక్షించాలన్న ఆశయాన్ని సర్కారు ప్రకటించింది. ఈ ప్రకటనతో విపక్షాలు భగ్గుమన్నాయి. ప్రధాన విపక్షం భాజపా ఈ ప్రకటనపై తీవ్రంగా మండిపడుతూ ముడా అక్రమాల్లో ఏ1 నిందితుడైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎంతో పవిత్రమైన నవరాత్రులను రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకున్నారని తప్పుబట్టింది. తన చేతికి అంటిన పాపంతో నవరాత్రులు ఆచరించినా అది రాష్ట్రానికి అరిష్టమంటూ ఆరోపించింది. మరోవైపు కేంద్ర మంత్రి కుమారస్వామి సైతం ఈ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ ప్రజలకు ధర్మోపదేశాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో ఎలాంటి ధర్మాన్ని అనుసరించిందని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజె, ప్రహ్లాద్ జోషి తదితరులు సైతం ఈ పవిత్రమైన దసరాను రాజకీయ వేదికగా మార్చుకున్నట్లు ఆరోపించారు. ఈ ప్రకటన వెనుక సర్కారు ఉద్దేశం ఎలా ఉన్నా.. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల్లో ఏ పార్టీ నేత నోరు మెదిపినా అది అవినీతి, అక్రమాలు, కేసులు, విమర్శలకే పరిమితమవుతూ దసరా ఉత్సవాన్ని కాస్త రాజకీయ ఉత్సవంగా మారుస్తున్నారు.

నిత్యం ప్రతీకారేచ్ఛ

మంత్రివర్గ సమావేశమైనా, మంత్రుల పిచ్చాపాటి సమావేశాలైనా, బెంగళూరుకు వచ్చినా, దిల్లీకి వెళ్లినా రాజకీయమే తప్ప పాలనాపరమైన ఆలోచన లేదన్న వాదన వినిపిస్తోంది. ముఖ్యమంత్రి మైసూరు దసరా ఉత్సవాల కోసమని సొంత జిల్లాకు వచ్చినా నిత్యం ఆయన మనసులో ముడా కేసును జపిస్తున్నారన్న వాదనను కొట్టిపారేయలేం. మొన్నటి వరకు ఈ కేసులో బయటివారిని విచారించిన లోకాయుక్త గురువారం తన బావమరిదిని విచారించటంతో ముఖ్యమంత్రికి కాస్త ఆందోళన మొదలైంది. ఏ క్షణంలోనైనా ముఖ్యమంత్రికి ఈడీ,

దేనినీ వదలని నాయకులు

లోకాయుక్తల నుంచి పిలుపు రావచ్చు. ఆయన దసరా ఉత్సవాల్లో ఉన్నారన్న మాటేగానీ దృష్టంతా కేసులపైనే. సంబరాల బాధ్యత తీసుకున్న మంత్రి హెచ్.సి.మహదేవప్పకూ ఇదే గుబులు. తన ప్రియతమ నేత సిద్ధరామయ్య మెడకు చుట్టుకున్న కేసు మైసూరు నగరాభివృద్ధి సంస్థకే చెంది ఉండటంతో ఈ జిల్లాలో చోటు చేసుకునే ప్రతి సంఘటనపైనా దృష్టి సారించాల్సి వస్తోంది. మంత్రివర్గ సమావేశం నిర్వహించినా అది విపక్షాలను నిలువరించే ప్రయత్నంగానే ఉంటోంది. గురువారం నాటి సమావేశంలో కరోనా చికిత్స అక్రమాలపై విచారణ, హుబ్బళ్లిలో మతకలహాల్లో నమోదైన కేసుల మాఫీ.. ఇవన్నీ రాజకీయ ప్రతీకారేచ్ఛ కోసమేనని రాజకీయ విశ్లేషణలు ఊపందుకుంటున్నాయి. మరోవైపు విపక్షాలు దసరా శుభాకాంక్షలు చెప్పినా, పత్రికా ప్రకటన చేసినా అందులోనూ రాజకీయమే తొంగిచూస్తోంది. ఈ ప్రచారాల్లో ముఖ్యమంత్రి చిత్రం కనిపించినా ఆయనపై నమోదైన కేసులను జోడించి విమర్శలకు దిగుతున్నారు. గతేడాది కరవుతో ఈ ఏడాది రాజకీయ ఏకరవుతో నాడహబ్బ దసరాను ఆచరించే ఏలికలు వచ్చే ఏడాదైనా సంబరాల్లో భాగమవుతారా లేదా అన్నది భవిష్యత్తే నిర్ణయించాలి.

అప్పను ఎప్పుడు తప్పిస్తారు?

శోభాకు సిద్ధు ప్రశ్న



విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

మైసూరు, న్యూస్‌టుడే : పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పపై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హితవుపలికారు. బీఎస్‌వైను భాజపా పార్లమెంటరీ బోర్డు నుంచి ఎప్పుడు తొలగిస్తారని ప్రశ్నించారు. మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో విలేకరులతో సీఎం శుక్రవారం మాట్లాడారు. పత్రికల్లో ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలను అడ్డుపెట్టుకుని వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్న భాజపా నాయకులు అందరూ తమను తాము ప్రశ్నించుకోవాలని సూచించారు. న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిలు తీసుకుని యడ్డీ బయట ఉన్న విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. పాత హుబ్బళ్లిలో నిందితులపై కేసులను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంటుందని గుర్తు చేశారు. నేడు (శని) జంబూసవారీలో తాను పాల్గొంటానని, ముఖ్యమంత్రిగా ఎక్కువసార్లు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు దక్కిందన్నారు. ప్రజలే తనకు ప్రభువులని, వారే ఈ అవకాశాన్ని తనకు కల్పించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో అభిమానులు, శత్రువులు ఉండడం సహజమేనని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ ఆరోగ్యకరమైన చర్చలే జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు.

స్పష్టతలేని కుల సమీక్ష

అదెంతో పాతది: కుమార



హారతి కళ్లకు అద్దుకుంటున్న కుమారస్వామి

మైసూరు, న్యూస్‌టుడే : అపుడెపుడో.. పదేళ్ల కిందట నిర్వహించిన కులగణన సమీక్షా నివేదికకు ఇప్పుడు ఆమోదం ఎలా పలుకుతారని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన చాముండేశ్వరిని శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కులగణన నివేదికను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన కార్యాలయంలో కూర్చుని సిద్ధం చేశారని అధికార పార్టీ నాయకులే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. నేను సంకీర్ణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నివేదికను స్వీకరించలేదని కొందరు నేతలు చేసిన ఆరోపణలను ఖండించారు. అప్పట్లో కేవలం 14 నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నానని, సిద్ధరామయ్య మొదటిసారి ఆ పదవిలో ఉన్నప్పుడే నివేదికను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నిత్యం గొర్రెలు కాసుకునే వాడు, ముఖ్యమంత్రి అయ్యాడని మీకు కడుపుమంట అని తనను ఉద్దేశించి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా చిన్న వయసులో టీ విక్రయించారని గుర్తు చేశారు. ఇతరులు ఉన్నత పదవుల్లో ఉంటే అసూయపడేవాడిని కాదన్నారు. అధికారం, హోదా అన్నీ ప్రజల భిక్షేనని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి మార్పు అనేది కాంగ్రెస్ నేతలు తీసుకోవలసిన నిర్ణయమని, మాకెలాంటి సంబంధం లేదన్నారు. గత ఏడాది తాను చూపించిన పెన్‌డ్రైవ్‌లో ఎటువంటి అశ్లీల చిత్రాలు లేవని, అక్రమ బదిలీలకు సంబంధించిన వివరాలే ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఆరోపణల నుంచి తప్పించుకునేందుకే కరోనా మహమ్మారి సమయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రత్యేక దర్యాప్తు దళాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలల అనంతరం దర్యాప్తు చేయించాలని గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. 'దుష్టశక్తులపై సత్యానికే జయం' అని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వ తీరును ఆయన తూర్పారబట్టారు. ఏ సత్యాన్ని, ధర్మాన్ని మీరు కాపాడారని ప్రశ్నించారు. వాల్మీకి కార్పొరేషన్ ద్వారా పేదలకు ఇవ్వవలసిన నగదును దారి మళ్లించి, నేతలు తమ సొంత ఖాతాలకు మళ్లించుకున్నారని రుజువైనా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని దుయ్యబట్టారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లోనూ అక్రమంగా ఇళ్ల స్థలాలను పొంది, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు విపక్ష నేతలపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. కుమారతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యేలు హరీశ్ గౌడ, మంజేగౌడ, స్థానిక నేతలు ఉన్నారు.

నీట మునిగి ఇద్దరు బాలికల మృతి

కలబురగి, న్యూస్‌టుడే : అఫ్జలపుర తాలూకా బన్నహట్టి గ్రామంలో నది వద్ద దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లిన భూమిక (8), శ్రావణి (11) అనే బాలికలు గురువారం సాయంత్రం నీట మునిగి మరణించారు. దుస్తులు ఉతుక్కున్న అనంతరం నీటిలో ఆడుకుంటూ భూమిక నీటిలో మునిగిపోయింది. ఆమెను రక్షించే ప్రయత్నంలో శ్రావణి కూడా నీట మునిగిపోయింది. ఇద్దరి మృతదేహాలను నీటి నుంచి శుక్రవారం ఉదయం వెలికి తీశారు. అఫ్జలపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తేనెవలలు విసిరి.. నగదు గుంజుడు.

ధార్వాడ, న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారిని తమ తేనెవలల ఉచ్చులో బిగించి, నగదు వసూళ్లకు పాల్పడుతున్న నలుగురిని విద్యాగిరి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఆకాశ, రేణుకా దంపతులు, మల్లిక్ జాన్ నదాఫ్, గజాలా భాను నగరిలను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.14.73 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువులను జప్తు చేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారికి వాట్సప్ నంబరు ఇచ్చి, వీడియో కాల్స్ చేసేవారు. వారి మాట విశ్వసించి వచ్చిన వారితో సన్నిహితంగా ఉండి, రహస్యంగా వీడియో రికార్డింగ్ చేసుకుని, బెదిరింపులకు పాల్పడేవారని విద్యాగిరి ఠాణా పోలీసులు తెలిపారు.

ప్రధాని కార్యాలయ అధికారినంటూ వంచన

ఉడుపి: ప్రధానమంత్రి కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ప్రధాన కార్యదర్శిని అంటూ ఒక వంచకుడు ఉడుపిలో ఆలయ దర్శనాన్ని చేసుకుని వెళ్లాడు. గురువారం ఉదయం పుత్తిగె మఠం దివాన్ నాగరాజ ఆచార్యకు ఫోన్ చేసి, తనను తాను డాక్టర్ ఉదయ్‌గా పరిచయం చేసుకున్నాడు. తాను, ఇతర కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం దర్శనానికి వస్తున్నామని, ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరాడు. ఉదయం దర్శనానికి వచ్చిన సమయంలో అతని ప్రవర్తనపై అనుమానం కలిగినా, అన్ని సదుపాయాలు కల్పించారు. ఉదయ్ వెళ్లిన అనంతరం ప్రధాన మంత్రి వెబ్‌సైటును, దిల్లీకి చెందిన నేతల దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లారు. ఆ పేరుతో ఎవరూ ప్రధాని కార్యాలయంలో పని చేయడం లేదని తెలుసుకుని కంగు తిన్నారు. అతని ఫోన్ నంబరు, కాల్ రికార్డులతో పాటు ఉడుపి ఠాణాలో నాగరాజ ఆచార్య ఫిర్యాదు చేశారు. ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయ పేరు వినియోగించడం మోసగాళ్ల తెగింపునకు పరాకాష్టగా భావిస్తున్నారు.

భళారే.. జంబూసవారీ!

నేడే వేడుకల కీలకఘట్టం

మైసూరు, న్యూస్‌టుడే : శరన్నవరాత్రులకు శనివారంతో తెరపడనున్న క్రమంలో రాచనగరి సందడిగా మారింది. ప్యాలెస్ ఆవరణ నుంచి అభిమన్యు బంగారు పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తితో ఊరేగించడమే కీలక ఘట్టం. ఈ కార్యక్రమాన్ని సాయంత్ర వేళ ప్రారంభిస్తారు. బన్నిమండపకు రాత్రి ఏడు గంటల సమయానికి ఆ ఏనుగులు చేరుకుంటాయి. అనంతరం కాగడాల ప్రదర్శనతో ఉత్సవాలకు తెరపడుతుంది. ప్యాలెస్ ఆవరణలో జంబూ సవారీని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, మైసూరు నగర కార్పొరేటర్లు, మేయరు, ఉపమేయరు, సాహితీవేత్త హంప నాగరాజయ్య, ప్రారంభిస్తారు. ఈ వేడుకల్లో కనీసం మూడు లక్షల మంది పాల్గొంటారని అంచనా. రాచనగరి మొత్తం కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటు, దేశ, విదేశాల నుంచి ఈసారి ఎక్కువ మంది భక్తులు చేరుకున్నారు. యువ దసరా, వస్తు ప్రదర్శన, ఫలపుష్ప ప్రదర్శన, కుస్తీ, ఇతర క్రీడా పోటీలు, సీఎం కప్, రైతు దసరా, డ్రోన్ల ప్రదర్శనకు శుక్రవారం తెరపడింది.



నిరుడు.. అమ్మవారి విగ్రహాన్ని బంగారు పల్లకీలో తీసుకువెళుతున్న అభిమన్యు. ఈసారీ ఆ గజరాజుకే వేడుకల్లో అగ్రాసనం

ఇంధనం సరిపోక విమానం వెనక్కి

బెంగళూరు (గ్రామీణం): బెంగళూరు నుంచి గోవాకు వెళుతున్న ఇండిగో విమానంలో ఇంధనం తక్కువగా ఉందని గుర్తించిన పైలెట్ కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి తిరిగి తీసుకువచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన అక్టోబరు ఎనిమిది సాయంత్రం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి ఆ రోజు సాయంత్రం 5.50కి బయలుదేరిన విమానం గోవా దాబోలిమ్ విమానాశ్రయంలో 6.45కు దిగవలసి ఉంది. ఆ సమయంలో గోవాలో భారీ వర్షం కురుస్తూ రన్‌వే కనబడడం లేదన్న సమాచారం రావడం, ముందుకు వెళ్లేందుకు ఇంధనం తక్కువగా ఉన్నట్లు గుర్తించి మళ్లీ విమానాన్ని బెంగళూరుకు తీసుకువచ్చారు. విమానంలో ఆ సమయంలో 222 మంది ప్రయాణికులు ఉన్నారు. బెంగళూరుకు వచ్చి ఇంధనాన్ని నింపుకొన్న విమానం అదే రోజు రాత్రి 11 గంటలకు గోవా చేరుకుంది.

ముంబయిలో బంగారు దొంగల ఆటకట్టు

యశ్వంతపుర, న్యూస్‌టుడే : బంగారు దుకాణం యజమాని ఇంట్లో నాలుగు కిలోల బంగారు నగలు, రూ.5 లక్షల నగదు చోరీచేసి, విదేశాలకు పరారవుతున్న చిక్కమగళూరుకు చెందిన సాధిక్ (44), అమ్మాన్(24) అనే దుండగులను ముంబయి విమానాశ్రయంలో మాగడి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బెంగళూరు నగర పరిధి డాక్టర్ రాజ్‌కుమార్ రహదారిలోని వాసవాంబ వస్త్ర, స్వర్ణాభరణ దుకాణాల యజమాని వేణుగోపాల్ గుప్తా ఈనెల 22న కుటుంబ సభ్యులతో పాటు చెన్నపట్టణకు వెళ్లారు. ఆ సమయంలో నిందితులు ఆయన ఇంటి తాళాలను బద్ధలుగొట్టి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. వేణుగోపాల్ గుప్తా కుటుంబసభ్యులు మరుసటి రోజు తిరిగివచ్చి చూసేసరికి చోరీ విషయం వెలుగుచూసింది. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు ముంబయి విమానాశ్రయానికి వెళ్లి, విదేశాలకు పారిపోయే ప్రయత్నంలో ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు నగర పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు అధికారుల సాహసాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

అంబారీ వేడుకలకు వేళాయె!

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత మైసూరు దసరా వేడుకలు ముగింపు ఘట్టానికి చేరుకున్నాయి. రాజవంశస్థుడు యదువీర కృష్ణదత్త చామరాజ ఒడెయరు మరోసారి తండ్రి కావడంతో ఆయన కుటుంబ సభ్యుల ఆనందం రెట్టింపైంది. అంబా ప్యాలెస్‌లో బంగారు సింహాసనంపై కూర్చుని యదువీర్ ఉదయం, సాయంత్రం కొంత సమయం ప్రైవేటు దర్బారు నిర్వహించారు. శుక్రవారం రాత్రికి ప్రైవేటు దర్బారుకు తెరపడింది. తన పట్టపు ఏనుగు, గుర్రం, ఒంటెలకు, ఆయుధాలకు, తమ కార్లకు, పల్లకీలకు పూజ చేశారు. పూజకు ముందు రాజుల ఆయుధాలను కోడి సోమేశ్వరాలయంలో శుభ్రం చేశారు. అనంతరం వాటిని పల్లకీలో ఉంచి, రాచప్రాసాదంలోకి తీసుకువెళ్లారు. నేడు (శని) విజయ దశమి యాత్ర ముగిసిన అనంతరం శరన్నవరాత్రులను పురస్కరించుకుని కట్టుకున్న కంకణాన్ని తీయనున్నారు. కుమారుడు పుట్టినా, రాజవంశానికి ఎటువంటి సూతకం ఉండదని అర్చకులు చెప్పడంతో అన్ని పూజలు, కార్యక్రమాల్లో ఆయన యథావిధిగా పాల్గొన్నారు.

● దసరా పండగను దృష్టిలో ఉంచుకుని రాజనగరి వీధులు అన్నింటిలో కలిసి 130 కి.మీ. మేర విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఈనెల 22 వరకు దీపాలంకరణను కొనసాగించాలని మైసూరు దసరా నిర్వహణ సమితి తీర్మానించింది.

● వేడుకలకు ఏనుగులతో వచ్చిన మావటీలు, అటవీశాఖ సిబ్బంది, వారి కుటుంబాలకు ప్యాలెస్ ఆవరణలో శుక్రవారం విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, మాజీ ఎంపీ ప్రతాప్ సింహ, ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స, ఆర్ఎస్ఎస్ నాయకుడు ఎం వెంకటరామ్, భాజపా నాయకులు ఎంవీ రవిశంకర్, మంజునాథ్, సతీశ్, శివకుమార్, తదితరులతో కలిసి బొబ్బట్లు, మిఠాయిలు, ఆహారాన్ని వడ్డించారు.


● యువ దసరాలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా గురువారం రాత్రి నిర్వహించిన కచేరికి చక్కని స్పందన లభించింది. తాను మొదటిసారి 1974లో మైసూరుకు వచ్చానని, జీకే వెంకటేశ్, పీబీ శ్రీనివాస్, ఎస్.జానకి ఆలపించిన పాటలకు కీబోర్డు వాయించానని గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి మైసూరుతో తనకు చక్కని అనుబంధం ఉందన్నారు. 'జనని జగని' అనే తమిళ గీతంతో కచేరిని ప్రారంభించి 'అమ్మ ఎందు కూగిదరె మై నవిరేళువుదు' అంటూ మూకాంబిక అమ్మవారిని కీర్తిస్తూ గానాలాపన చేశారు. గాయకులు శరత్, విభారవి, శ్వేతా మోహన్, హరిచరణ్‌లతో కలిసి పలు కన్నడ చిత్రాల్లోని పాటలకు ఆయన మార్గదర్శనం చేశారు.



ఆయుధాలకు పూజ చేస్తున్న రాజవంశస్థుడు యదువీర్




మావటీలు, అటవీ సిబ్బందికి బొబ్బట్లు వడ్డిస్తున్న శోభా కరంద్లాజె



విద్యుత్తు దీపాల వెలుగులో రాచనగరి

యదువీరునికి పుత్రోత్సాహం

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు రాజవంశస్థుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయరు- త్రిషికా దేవి దంపతులకు మరోసారి మగబిడ్డ జన్మించాడు. నవరాత్రి సందర్భంగా బిడ్డ జన్మించడం పట్ల రాజదంపతులు హర్షాన్ని వ్యక్తం చేశారు. మొదటిసారి ఎంపీగా, అందులోనూ దసరా సందర్భంలో బిడ్డ జన్మించడంతో రాచప్రాసాదంలో పండగ వాతావరణం మరింత రెట్టింపైంది. రాజమందిర విశ్వాసాల ప్రకారం.. మైసూరు వారసుల్లో దత్తత వచ్చిన వారే ఎక్కువ. యదువీరుడికే తొలిసారి తనయుడు జన్మించాడు. ఇపుడు అదే వంశంలో రెండో కుమారుడు జన్మించడంతో మందిరం సంబరాల్లో మునిగిపోయింది.



తనకు పుత్రుడు కలిగాడని యదువీర్ విడుదల చేసిన పత్రం

ముప్పు ముంగిట నందికొండ



పోస్టర్లు ప్రదర్శిస్తున్న పర్యావరణ ప్రేమికులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చారిత్రక నంది కొండలపైకి తీగమార్గం (రోప్‌వే) ఏర్పాటు సరికాదని పర్యావరణ ప్రేమికులు, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు నదుల జన్మస్థానమైన ఆ ప్రాంతానికి కృత్రిమమార్గాలు నిర్మిస్తే పర్యావరణ సమతౌల్యత దెబ్బతిని వయనాడు తరహాలో ప్రమాదాలు సంభవిస్తాయనే ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పర్యావరణవేత్త డాక్టర్ ఏఎన్ యల్లప్పరెడ్డి, గివ్ లైఫ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ భరత్ ఫిషర, దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు సంజనా జాన్, ఆచార్య రేణుకా ప్రసాద్, సీడీ కిరణ్ తదితరులు మాట్లాడారు. అరకావతి, పాలార్, పెన్నార్, దక్షిణ పెన్నార్, చిత్రావతికి ఈ కొండ జన్మస్థానమని తెలిపారు. వివిధ జంతుజాలం, మొక్కలకు ఆలవాలంగా ఉన్న ఈ కొండను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.

నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హోసదుర్గం తాలూకా శ్రీరాంపురం, బెలగూరు గ్రామాల్లో కారులో వచ్చిన ముగ్గురు దుండగులు 3 దుకాణాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసి రూ. 22 వేలను నకిలీ ఫోన్ పే యాప్ ఉపయోగించి మోసం చేసిన ఉదంతమిది. పరారైన వారిని శ్రీరాంపురం పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ శుక్రవారం తెలిపారు. చిత్రదుర్గంనకు చెందిన ధీరజ్ (21), తరుణ్(20), సూరనహళ్లి గ్రామానికి చెందిన కిరణ్(24) శుక్రవారం ఉదయం దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేసి ఫోన్ పే యాప్ క్యూఆర్ కోడ్ ద్వారా స్క్యాన్ చేసి దుకాణాల యజమానులకు నగదు చెల్లింపులు చేశారు. దుకాణాల యజమానుల ఫోన్‌కు డబ్బు బ్యాంకు ఖాతాకు జమైనట్లు సందేశం వచ్చినా జమ కాలేదు. అనుమానం వచ్చిన దుకాణదారులు వెంటనే శ్రీరాంపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుళియారు బస్టాండు వద్ద నిందితులు తారసపడ్డారు. వారిని అదుపులోనికి తీసుకొని విచారించగా ముఠాలో సూరనహళ్లి గొల్లరహట్టికి చెందిన శివకుమార్ (28), మాళప్పనహట్టికి చెందిన దేవరాజ్(28) సైతం ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ పరారీలో ఉన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోకపోవడంతో దుకాణదారులు వంచనకు గురవుతున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ. 10 లక్షల విలువైన కారు, వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్పీ వివరించారు.

వాలీబాల్ ఆటగాళ్లకూ అర్జున్‌లు అందాలి

'న్యూస్‌టుడే'తో శిక్షకుడు వాకలపూడి నాగేశ్వరరావు

సింధనూరు, న్యూస్‌టుడే: అన్ని క్రీడల్లో ఆటగాళ్లకు అర్జున్ పురస్కారాలు అందించే ప్రభుత్వం వాలీబాల్‌లో ఉత్తమ ఆటగాళ్లను గుర్తించి ఆ లోటు తీర్చితే తానెంతో ఆనందిస్తా.. అది చూడాలన్నదే నా ఆశ అని భారత వాలీబాల్ జట్టు కోచ్, కర్ణాటక వాలీబాల్ సమాఖ్య కార్యదర్శి వాకలపూడి నాగేశ్వరరావు తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ఇటీవలే పారిస్‌లో జరిగిన దివ్యాంగుల పారా ఒలింపిక్స్ క్రీడలకు భారత అథ్లెటిక్స్ జట్టుకు కోచ్‌గా వెళ్లారు. అంతకు ముందే ఆయన ఏషియన్ ఛాంపియన్‌షిప్ సిట్టింగ్ వాలీబాల్ జట్టు కోచ్‌గా కజకిస్తాన్‌కు.. వెనువెంటనే ఈజిప్ట్‌లో జరిగిన సిట్టింగ్ వాలీబాల్ జట్టుకు భారతజట్టు కోచ్‌గా వెళ్లొచ్చారు. చైనాలో జరిగిన రెండు ఏషియన్ గేమ్స్‌కు భారతజట్టు తరపున ఈయనే కోచ్. ఇంతటి భారీ క్రీడా వేదికలకు ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ తరపున కోచ్‌గా వెళ్లిన నాగేశ్వరరావు సింధనూరు వాసే. సింధనూరు దసరా ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు సింధనూరు వచ్చిన ఆయన కొద్దిసేపు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. సమీపంలోని రంగాపూరు క్యాంపు వీరిది. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా నుంచి కర్ణాటకకు వలస వచ్చిన వీరి కుటుంబం ఇక్కడే స్థిరపడింది. క్యాంపులోనే జన్మించిన నాగేశ్వరరావు ప్రాథమిక విద్యను రంగాపూరు క్యాంపు, హైస్కూలు సింధనూరు సుక్కాలపేట ప్రభుత్వ స్కూల్లో చదివారు. పీయూసీ నుంచి ఉన్నత చదువు బెంగళూరులో చదివారు. విద్యార్థి దశలోనే వాలీబాల్ ఆటపై మక్కువతో చాలా పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. గురువుల ప్రోద్బలంతో కేరళలోని త్రివేండ్రం వెళ్లి వాలీబాల్ ఎన్ఐసీలో డిప్లొమా చేశారు. అనంతరం అంచెలంచెలుగా భారతజట్టు కోచ్ స్థాయికి ఎదిగారు.



దసరా ఉత్సవాలకు వచ్చిన నాగేశ్వరరావును స్వాగతిస్తున్న సింధనూరులోని ఓ విద్యా సంస్థ

దివ్యాంగులు ఎంతటి సమర్థులో..: పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌పై నాగేశ్వరావు తన అనుభవాలను తెలిపారు. పేరుకు దివ్యాంగులే అయినా వీరు అన్ని అవయవాలు గల సమర్థులకు ఏమాత్రం తీసిపోరన్నారు. చేతులూ, కాళ్లూ లేకున్నా హైజంప్‌లో, ఆర్చరీలో వీరు సామాన్య ఆటగాళ్లకు సరిసమాన పాయింట్లతో నిలుస్తున్నారని వివరించారు. ఆర్చరీలో సీతల్ దేవి ప్రదర్శన ఎంతోమందిని విస్మయపర్చిందని గర్వంగా చెప్పారు. పారిస్‌లో కంటే చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్ నాకెంతో నచ్చాయని అన్నారు. క్రీడా వేదికల నిర్వహణలో పారిస్ కంటే చైనా చాలా ముందుందని చెప్పారు. అలాంటి బాధ్యతలు భారత్ సగర్వంగా నిర్వర్తించగలదని.. చైనాతో భారత్ సరితూగగలదని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.



సింధనూరులోని యువ ఆటగాళ్ల కష్టాలు తెలుసుకుంటున్న నాగేశ్వరరావు

ఫ్చ్..ట'మాట' రావడంలేదు!

☛ రవాణా ఖర్చులూ దక్కలేదు ☛ మార్కెట్లోనే వదిలేసిన రైతులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి కూరగాయల మార్కెట్‌లో ఒక్కసారిగా టమాటా ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన సరకుకు రవాణా ఖర్చులు, హమాలీ కూలి ఖర్చులూ రావడం లేదని అక్కడే వదిలేస్తున్నారు. నెల రోజులుగా బళ్లారి ఏపీఎంసీ కూరగాయల మార్కెట్‌లో టమాటా కిలో రూ. 40 నుంచి రూ. 60 ధర పలికింది. 24 కిలోల పెట్టె.. రూ. 800 నుంచి రూ. 1200 విక్రయించారు. ఉన్నట్టుండి రెండు రోజులుగా బళ్లారి ఏపీఎంసీలోని టోకు మార్కెట్‌కు సరకు భారీగా వస్తోంది. 24 కిలోల పెట్టె రూ. 60 నుంచి అత్యధికంగా రూ. 550 పలికింది. మచ్చ లేకుండా కొద్ది పచ్చిగా ఉండే టమాటా మాత్రం రూ. 550 పలికింది. మిగిలిన గోలీల పరిమాణం ఉన్నవి, మచ్చ పడిన కాయలు రూ. 60 నుంచి రూ. 200లోపు పలికింది.

రైతులకు ఖర్చులు రావడం లేదు

బళ్లారి ఏపీఎంసీలోని టోకు కూరగాయల మార్కెట్‌కు అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, పాల్తూరు, కల్యాణదుర్గం, రాయదుర్గం, బొమ్మనహళ్, డి.హిరేహళ్, కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల రైతులు పండించిన టమాటాను బళ్లారి మార్కెట్‌కు తీసుకుని వస్తున్నారు. నెల రోజుల మంచి ధర ఉండటంతో రైతులు ఖర్చులుపోను కొద్దిగా చేతికి అందేది. రెండు రోజులుగా మార్కెట్‌కు సుమారు 10వేల పైగా పెట్టెలు వస్తున్నాయి. 24 కిలోల పెట్టె పొలం నుంచి మార్కెట్‌కు తీసుకుని రావడానికి రూ. 30 నుంచి రూ. 40 వరకు ఖర్చవుతుంది. మార్కెట్‌లో వాహనం నుంచి అన్‌లోడింగ్ చేసే హమాలీ కూలి పెట్టెపై రూ. 5, వ్యాపారులకు కమీషన్ రూ. 100కు రూ. 10 ఉంటుంది. శుక్రవారం ధరలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఎక్కువ మంది రైతులు మార్కెట్లోనే వదిలి వెళ్లిపోయారు. శనివారం ఎంత వస్తే అంతకు విక్రయించాలని ఇంటికి వెళ్లిపోయారు.

రవాణా ఖర్చు రాలేదు



మాది అనంతపురం జిల్లా కణేకల్లు మండలం, కరదకుంట గ్రామం.. ఆరు ఎకరాల్లో టమాటా పంటను సాగు చేశాను. కొన్ని పెట్టెలు, అనంతపురం మార్కెట్‌కు మరికొన్ని పెట్టెలను బళ్లారి మార్కెట్‌కు తీసుకుని వచ్చాను. ధర పూర్తిగా తగ్గుముఖం పట్టింది. తోటలో కోత ఖర్చులు, మార్కెట్ తరలించే రవాణా ఖర్చులు, వ్యాపారి కమీషన్, హమాలీ ఖర్చులూ చేతికి అందడం లేదు. టమాటా వ్యాపారమూ లాటరీగా మారింది. గిట్టుబాటు ధర నిర్ణయిస్తే అనుకూలంగా ఉంటుంది. - **గంగయ్య, రైతు, కరదకుంట**



వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్న రైతు



ధర లేక టమాటాను మార్కెట్‌లోనే వదిలి వెళ్లిన రైతులు

గుర్తు తెలియని జంట ఆత్మహత్య

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హడగలి తాలూకా పరిధి మైలారా సమీపం తుంగభద్ర నదీ తీరంలో గుర్తు తెలియని జంట చెట్టుకు ఉరుసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఒకే తాడుకు చెరోవైపు ఉరేసుకున్నారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు, యువతి వివరాలు తెలియరాలేదని హడగలి సీఐ తెలిపారు. గురువారం ఈ జంట మైలారా ఆలయంలో పూజలు చేయించినట్లు యువకుడి జేబులో దొరికిన ఆలయం రసీదు ద్వారా తెలిసింది. ఈ జంట నదీ తీరంలో ఉదయం సంచరించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి జేబులో దొరికిన నాజూకు చరవాణి స్విచాఫ్ చేసిఉంది. రాత్రి కురిసిన వర్షాలతో చరవాణిలో నీరు చేరుకుని ఆన్ కావడం లేదని పోలీసులు తెలిపారు. చరవాణి ఆన్ అయితే వారి ఆచూకీ తెలిసే అవకాశం ఉందని ఘటనా స్థలానికి చేరుకున్న హొళలు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకా తళకు పోలీసు ఠాణా అధికారులు సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం నగరంలోని ఎన్జీవో కాలనీలో నివాసముంటున్న నీలం శ్రీరామ్ విజయ్, విజయవాడకు చెందిన రంగుల ప్రసాద్ అనే నిందితులను హీరేహళ్లి వద్ద జరిగిన ఇంటి దోపిడీ కేసులో అరెస్టు చేసినట్లు చెళ్లకెర డీవైఎస్పీ రాజణ్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది జులై నెల 9వ తేదీ రాత్రి తళకు పోలీసు ఠాణా పరిధిలోని హీరేహళ్లి గ్రామం శివారులో ఒంటరి ఇంట్లో నివాసముంటున్న మొక్కజొన్నల వ్యాపారి తిప్పేస్వామి ఇంట్లో ముగ్గురు దుండగులు చొరబడి కుటుంబ సభ్యుల కాళ్లు, చేతులు కట్టి వేసి రూ. 6.25 లక్షల విలువైన బంగారు, వెండి నగలు, కొంత నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు తళకు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తును చేపట్టిన పోలీసులు నిందితులు నీలం శ్రీరామ్ విజయ్, రంగుల ప్రసాద్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కేసులో ప్రధాన నిందితుడు పాల వెంకటేశ్వర్ పరారీలో ఉండగా అతనికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అభినందించారు.

గానంతో ఉర్రూతలూగించిన విజయ్ ప్రకాశ్

సింధనూరు: సింధనూరు సంగీత ప్రపంచంలో ముద్దయింది. శుక్రవారం రాత్రి స్థానిక ప్రభుత్వ స్టేడియం జనసాగరంగా మారింది. 'సింధనూరు దసరా' వేడుకల్లో భాగంగా ఉత్సవ సమితి స్టేడియంలో ప్రముఖ నేపథ్య గాయకులు విజయ్ ప్రకాశ్, అనురాధా భట్ సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా వేల సంఖ్యలో జనం ఎగబడ్డారు. పునీత్, కిచ్చ సుదీప్, డీ బాస్, యశ్ తదితర హీరోలు నటించిన చిత్రాల్లోని పాటలు పాడి జనాన్ని నర్తింపజేసిన విజయ్ ప్రకాశ్ కొన్ని గంటలు సింధనూరు ప్రజలను మరోలోకంలోకి తీసుకెళ్లారు. కొన్ని తెలుగు సినిమా పాటలు కూడా పాడారు. తొలుత అభిమానులు తొలిసారి సింధనూరును తొమ్మిది రోజులపాటు సాంస్కృతిక వేదికగా మార్చి మరో మైసూరును చేసినందుకు నాయకులు బాదర్లి, కేవీ, నాడగౌడలను సత్కరించారు.



శ్రావ్యమైన పాటలతో జనాన్ని మైమరిపించిన ప్రముఖ గాయకులు విజయ్ ప్రకాశ్, అనురాధా భట్



స్టేడియలో తమ చరవాణి టార్చ్‌లు వెలిగించి ఓలలాడుతున్న జనం

భక్తిభావనే ముక్తిదాయకం


చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ప్రతి మనిషిలో భక్తి ఉంటేనే శాంతి, సామరస్యాలు సాధ్యమని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు పేర్కొన్నారు. ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో దసరా మహోత్సవాలు, నవరాత్రి హోమం, మహారుద్ర యాగం, మేధా దక్షిణామూర్తి పూర్ణాహుతి, సరస్వతి హోమాల్లో మంత్రి కేహెచ్ మునియప్ప, సద్గురువు మధుసూదన సాయితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వాసం, అభ్యాసం ఉన్నప్పుడే సామరస్యం, పరమత సహనం అలవడతాయని, అప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని వివరించారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ సత్యసాయి గ్రామంలో తాము తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మధుసూదన సాయి వివరించారు. సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జిల్లాధికారి పీఎన్ రవీంద్ర, స్థానికులు నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పూజలో సద్గురువు మధుసూధన సాయితో మంత్రి కేహెచ్ మునియప్ప



బళ్లారి కనక దుర్గమ్మకు బంగారు ఆభరణాల అలంకరణ



దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి విశేష అలంకరణ



కృష్ణానగర క్యాంపులో దుర్గమ్మ దేవస్థానంలో మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో..



నగరేశ్వర దేవస్థానంలో అమ్మవారు



చండీదేవిగా చిన్నదుర్గమ్మ



కాత్యాయనిగా సంతోషిమాత



కాళరాత్రి అలంకరణలో ఏళుమక్కళతాయి



మహాచండీగా రేణుకయల్లమ్మ



సిరుగుప్ప కాళికాదేవి అలంకరణలో తాయమ్మదేవి



కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై మహిషాసుర మర్దినిగా శ్రీదేవి



శ్రీరామనగర్‌లో కనకదుర్గమ్మ



కంప్లి: హెచ్..వీరాపుర శివలింగ మందిరంలో బనశంకరీ దేవి



హొసపేటె: బళ్లారి మార్గంలో కొలువుదీరిన అంబాభవాని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



గాంధీనగర్‌లో మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు

అమ్మ దర్శనం..పులకించిన భక్తజనం

బళ్లారి, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. బళ్లారి తాలూకా కృష్ణానగర క్యాంపులో దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మను దర్శనం చేసుకున్నారు. బళ్లారి నగర హొసపేటె రహదారిలోని ఏళుమక్కల దేవస్థానంలో అమ్మను విశేషంగా అలంకరించారు. దేవస్థానం ట్రస్ట్ అధ్యక్షుడు గోవిందరాజులు నేతృత్వంలో తాయణ్ణ కుటుంబసభ్యులు హోమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళ భక్తులకు చీరలు, గాజులు, పసుపు కుంకం వితరణ చేశారు. బళ్లారి కనక దుర్గమ్మను విశేషంగా రెండో రోజు బంగారు ఆభరణాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అమ్మను దర్శనం చేసుకున్నారు.

సర్వమంగళరూపిణీ..మహాచండీ..

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదోరోజు అమ్మవారు మహాచండీరూపంలో మహిషాసురమర్దనిగా పూజలందుకున్నారు. చిన్నదుర్గమ్మకు, గంగాపరమేశ్వరీ, రేణుకయల్లమ్మ, ఏళుమక్కళతాయిలకు చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. సంతోషిమాత కాత్యాయని, తుల్జాభవానికి నిమ్మకాయలు, లక్ష్మీబాలాజీ పద్మావతికి పుష్పాల తోనూ, నీలకంఠేశ్వరీ, విద్యానగర్ దుర్గాదేవి, కనకదుర్గమ్మ, మల్నాడు దుర్గమ్మ, బెంకిమారెమ్మ, వాసవీమాతను విశేషంగా అలంకరించారు. చిన్నదుర్గమ్మ దేవస్థానంలో గత పదిరోజుల నుంచి మూడువేలమంది ముత్తైదువులకు ఒడిబియ్యం వేశారు. అమ్మవారికి గంగపూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. నృత్యప్రదర్శనలు భక్తులను అలరించాయి.

కారటగి, న్యూస్‌టుడే: దేవిక్యాంపు రత్నగిరిపై మహా నవమి రోజు శ్రీదేవి మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. సిద్ధిధాత్రి పూజ, నవచండీ యాగం, మహా పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. కారటగి జేపీనగర్‌లోని శ్రీదేవి, సాలోణి వీధిలోని హులిగమ్మ దేవి, కన్యకాపరమేశ్వరి, బన్ని మహంకాళి తదితర ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.



దుర్గాపూజలో అమ్మవార్ల అలంకరణ

● **శ్రీరామనగర్‌లో:** కనకదుర్గాదేవిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. సూర్య నమస్కారాలు తదితర పూజలు జరిగాయి. సంతోషి మాత, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

● **కంప్లి:** హెచ్.వీరాపుర జ్ఞానజ్యోతి జడేశ శివలింగ మందిరంలో బనశంకరీ దేవిని అలంకరించి పూజలు జరిపారు. నెల్లుడి కొట్టాలులో పెద్దమ్మ దేవికి విశేష పూజలు కొనసాగాయి.

హొసపేటె, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి దేవీ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. బళ్లారి మార్గంలో ఉన్న అంబాభవాని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. పటేల్‌నగర్‌లో కొలువుదీరిన దుర్గాపరమేశ్వరి అమ్మవారు దివ్యాలంకరణ శోభితులుగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం విజయదశమి వేడుకలకు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకుని తాలూకాలోని నాగలింగేశ్వరక్యాంపులో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంబాదేవి విగ్రహాన్ని శుక్రవారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భాజపా నాయకుడు కె. కరియప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతం ప్రజలకు బగళాముఖి సిద్ధపర్వత అంబాదేవి మహాత్మ్యం చాలా గొప్పదని పేర్కొన్నారు. అందుకే ఈ అమ్మవారు అంబామఠంలోనే కాక అన్నిచోట్లా భక్తులను అనుగ్రహించేందుకు వివిధ క్యాంపులలో దర్శనమిస్తున్నారని కీర్తించారు. శుక్రవారం మహానవమి సందర్భంగా సింధనూరులోని ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు



భక్తిశ్రద్ధలతో పూజలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెరలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆయుధ పూజను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆయుధ పూజ సందర్భంగా పట్టణంలోని వాణిజ్య దుకాణాలు, ఉత్పాదక సంస్థలు, కర్మాగారాల్లో కార్మికులు యంత్రాలు, వాహనాలకు పూజలు చేశారు. పట్టణంలోనే కాకుండా తాలూకాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలు తమ వాహనాలు, యంత్రాలు, వ్యవసాయ పరికరాలకు పూజలు చేశారు. దేవాలయాలను విద్యుత్తు దీపాలు, పూలు, అరటి గెలలతో అలంకరించారు.

రతన్ టాటా గొప్ప ఆర్థిక, సామాజిక సంస్కర్త

మాన్వి, న్యూస్‌టుడే: రతన్‌టాటా చేసిన సామాజిక సేవ, ఆర్థిక సంస్కరణ, వ్యాపార దిగ్గజంగా దేశానికి ప్రపంచ వ్యాప్తంగా కీర్తిప్రతిష్ఠలను తీసుకొచ్చారని కమ్మవారి సంఘం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కమ్మవారి సంఘం సముదాయ భవనంలో టాటాకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ సమాజం ప్రధానోపాధ్యాయుడు వెలంకి రవిబాబు మాట్లాడుతూ రతన్‌టాటా చేసిన ప్రతి పనిలో, వ్యాపారంలో దేశ ప్రజల సంక్షేమం దాగి ఉందన్నారు. కాకతీయ శిక్షణ సంస్థ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి టి.రామకృష్ణ, కమ్మవారి సంఘం కార్యదర్శి జి.శ్రీనివాస్ మాణిక్యాలరావు, ఉపాధ్యక్షుడు పుట్టప్రసాద్, ఉమామహేశ్వరరావు, కోశాధికారి మల్లికార్జున, సభ్యులు జి.సుబ్బారావు చౌదరి, బి.టి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, పఠకుమార్, రాంబాబు, డి.రామకృష్ణ, సత్యనారాయణ, కృష్ణమోహన్‌రావు, సరేశ్వరరావు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

16న కన్నడ రాజ్యోత్సవంపై సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్వహించే 69వ రాజ్యోత్సవంపై ఈ నెల 16న మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక అనంతపురం రహదారిలోని నూతన జిల్లా సంకీర్ణ భవనంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్నడ సంస్కృతిశాఖాధికారి నాగరాజ తెలిపారు. సమావేశానికి జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధ్యక్షత వహిస్తారన్నారు. సంబంధిత అధికారులు వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని సలహాలు ఇవ్వాలని కోరారు.

యాత్రాస్థలాల వీక్షణతో జ్ఞానాభివృద్ధి



బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రతినిధులు, అధికారులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: యాత్రా స్థలాల వీక్షణతో విద్యార్థుల్లో జ్ఞానాభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందని నగరసభ మాజీ అధ్యక్షుడు బి.ఎం.సతీష్ పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పరిశిష్ట జాతి విద్యార్థులు, యాత్రికుల కోసం మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లోని దీక్షాభూమి, ఇతర యాత్ర స్థలాల వీక్షించేందుకు వెళ్తున్న బస్సు యాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొడ్లె మల్లికార్జున, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సిద్ధయ్య, ఇతర ప్రతినిదులు పాల్గొన్నారు.

ప్రవచనాల శ్రవణంతో జ్ఞాన వికాసం



ఆలయ ప్రాంగణంలో దేవి పురాణం ప్రవచనం వినిపిస్తున్న కల్లినాథశాస్త్రి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రవచనాలు ఆలకిస్తే మనిషిలో దాగి ఉన్న అజ్ఞానం తొలగి జ్ఞానం వైపు సాగేందుకు దోహదపడుతుందని హల్వి చరణగిరి శివయోగిశ్వర సంస్థాన మఠం మఠాధిపతి అభినవ మహంత మహాస్వామి పేర్కొన్నారు. రారావి యల్లమ్మదేవి ఆలయ ప్రాంగణంలో 40వ వార్షికోత్సవ శరన్నవరాత్రి పురాణ ప్రవచన కార్యక్రమానికి సాన్నిధ్యం వహించి ఆయన ప్రసంగించారు. ప్రవచనాలు వింటే సమాజంలో మంచి, చెడు, మహనీయుల జీవన శైలి తెలుస్తాయన్నారు. ఉత్తమ జీవనం సాగించేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. బేటిగిరి మఠాధిపతి బసవలింగాస్వామి, సంగీతం చిదానంద గవాయి, తబలా రామలింగప్ప హూగార్ వాయించగా, కల్లినాథ శాస్త్రి దేవి పురాణ ప్రవచనం చేశారు.

రోటరీ హాలుకు రతన్‌టాటా పేరు



రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్బుల సభ్యులు

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణంలోని స్టేషన్ మార్గంలో కొత్తగా నిర్మించిన రోటరీ హాల్‌కు దివంగత రతన్‌టాటా పేరు పెట్టామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు దీపక్ కొళగద్ పేర్కొన్నారు. కొత్త హాల్లో రతన్‌టాటాకు గురువారం రాత్రి ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన దేశం పారిశ్రామికంగా ఎదగటానికి రతన్‌టాటా ఎంతగానో తోడ్పాటునందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్బులు, హంపీ పర్ల్స్ క్లబ్ ప్రముఖులు ప్రభా మహాదేవప్ప సిందగి, గొగ్గ చెన్నబసవరాజ్, వైకుంఠం తిరుపతినాయుడు, వై.శ్రీనివాసరావు, అశ్విన్ కొత్తంబరి, అబ్దుల్ హక్‌షేర్ తదితరులు పాల్గొని రతన్‌టాటాకు నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో హనుమ వాహనోత్సవం



మోహినీ రూపంలో..

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిదో రోజు శుక్రవారం వివిధ పూజలు జరిగాయి. స్వామి మోహినీ రూపంలో అలంకరించారు. గురువారం రాత్రి స్వామిని భక్తిశ్రద్ధలతో హనుమ వాహనంలో ఊరేగించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై తస్మాత్ జాగ్రత్త



దేశనూరు గ్రామంలో మాట్లాడుతున్న టీపీ నోడల్ అధికారి బసవరాజ్

సిరుగుప్ప, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే వారిని బలంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని తాలూకా పంచాయతీ నోడల్ అధికారి బసవరాజ్ పేర్కొన్నారు. దేశనూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా, తాలూకా పంచాయతీ, కౌశాల్య అభివృద్ధి, జీవనోపాధి శాఖలు, వినాయక సంజీవని సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో పిల్లల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇతర అతిథులతో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన వైద్యుల కొరత, వైద్య సేవలు సకాలంలో అందక అనేక మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో అనారోగ్యానికి గురువుతుంటారు. వీరికి నిత్యం పోషకాహారం అందిస్తూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తే చక్కని ఆరోగ్యంతో ఎదుగుతారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సభ్యుడు ఈశ్వర, వినాయక సంజీవని సమాఖ్య ప్రతినిధి పద్మావతి, పంచాయతీ అభివృద్ధి అధికారి హనుమాన్‌గౌడ గ్రామస్థులు పాల్గొన్నారు.

కోట్ల భవనం నిరుపయోగం..

◆ ఏపీఎంసీ మార్కెట్లో రుసుముల మెలిక
◆ ముందుకు రాని విక్రేతలు

బురదలోనే కూరగాయల విక్రయం



రూ.కోట్లతో నిర్మించిన భానువారం సంత భవనం



వ్యర్థాల పక్కనే తాజా కూరగాయల వ్యాపారం

బళ్లారి, న్యూస్‌టుడే: ఫుట్‌పాత్...రహదారులు...ప్లాట్‌ఫాం తదితర ప్రాంతాల్లో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే చిల్లర వ్యాపారులు ఒకే చిల్లర కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే వారిని ఒకే ప్రదేశంలో చేర్చడానికి, రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు మార్కెట్‌కు ప్రదేశంలో విక్రయించడానికి బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో నిర్మించిన ఆదివారం సంత నిరుపయోగంగా మారింది. మొదట్లో ఈ సంతలో ఒక్కొక్క ప్లాట్‌ఫాం రోజుకు కొంత రుసుం చెల్లించి విక్రయించుకోవాలని నిర్ణయించారు. ఎవరూ రాకపోవడంతో ఎలాంటి రుసుములు చెల్లించనవసరం లేదని, ఉచితంగా విక్రయించుకోవచ్చని ప్రకటించారు. అప్పటికే ఆరుబయట విక్రయించేందుకు అలవాటు పడ్డ వ్యాపారులు నేటికీ బురదలో ఉన్న రహదారులు, వ్యర్థాలు నిండిన ప్రదేశాలు, కాలు తీసి కాలు పెట్టలేని బురద పక్కనే తాజా కూరగాయలు విక్రయిస్తున్నారు. బురద కుంటలో కొనుగోలు చేయకలేక ఎక్కువ మంది వినియోగదారులు ఇంటి ముందుకు వచ్చే తోపుడు బండ్లపై రెండింతల ధరలతో కొనుగోలు చేసుకుంటున్నారు.

రూ.2.28 కోట్లతో భవనం

తీసుకుని వచ్చి నేరుగా విక్రయించడానికి 2017-18 ఏడాదిలో రూ.2.28 కోట్లతో భానువారం సంతను నిర్మించారు. మార్కెట్ లోపల 140 మంది టోకు వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించుకోవడానికి ప్లాట్‌ఫాంలు అనుకూలంగా ఉన్నాయి. పశువులు, గొర్రెలు, మేకలు, పందుల దాడి నుంచి విముక్తి కలిగే విధంగా ప్రధాన ద్వారం, తలుపులను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలు ఉన్నా రహదారులు, బురద ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లపైనే విక్రయిస్తున్నారు. టోకు వ్యాపారులు కిలోల ప్రకారం కూరగాయలు విక్రయిస్తుండటంతో భానువారం సంతలో విక్రయించే వారికి వ్యాపారం జరగడం లేదని వాపోతున్నారు. ఈ కారణంగా చిల్లర వ్యాపారులు రహదారులపై కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు.

వ్యాపారం జరగడం లేదు



కొంత మందికి మాత్రమే భానువారం సంతలో ప్లాట్‌ఫాం కేటాయించారు. వారు రహదారులు, ఫుట్‌పాత్‌లపై కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్నారు. మాకు ప్లాట్‌ఫాం కేటాయించలేదు. మేం భానువారం సంతలో ఓ పక్కనే పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాం. వ్యాపారం పెద్దగా లేకపోయినా పరిశుభ్రంగా ఉంటుంది. వర్షం వచ్చినా, ఎండ కాసినా భవనంలో అనుకూలంగా ఉంది. **- కేశమ్మ, వ్యాపారి**

దుమ్ము,ధూళి లేదు



మార్కెట్‌లోని ఫుట్‌పాత్‌లు, రహదారులు, బురద, వ్యర్థాల మధ్య విక్రయిస్తే కాలుష్యం, దుమ్ము ధూళితో ఇబ్బందిగా ఉండేది. ఎంత వ్యాపారమైనా ఇబ్బంది లేదని భానువారం సంతలోనే ప్లాట్‌ఫాంపై విక్రయిస్తున్నాం. సంత భవనంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అందరు ఇక్కడికే వస్తే మరింత అనుకూలంగా ఉంటుంది. **- ఈరమ్మ, వ్యాపారి**

టోకు వ్యాపారం నిలిపివేస్తే అనుకూలంగా ఉంటుంది



టోకు వ్యాపారులు వారి దుకాణాల ముందు చిల్లర వ్యాపారం నిలిపివేస్తే ప్రతి ఒక్కరూ భానువారం సంతకు వెళ్తారు. బయట కూరగాయలు విక్రయించకూడదని నిబంధనలు పెడితే ప్రతి ఒక్కరూ ఇక్కడికి వస్తారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. బురద, వ్యర్థాలు మధ్యలో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్నారు. **- నీలమ్మ, వ్యాపారి**

రహదారులపై విక్రయిస్తే ఇబ్బంది



బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో వేర్వేరు ధాన్యాలు తదితర వాటిని విక్రయించుకోవడానికి ప్రాంతాల నుంచి రైతులు వస్తున్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై కూరగాయలు, ఆకుకూరలు విక్రయించడం వల్ల ఇబ్బందిగా మారింది. భానువారం సంతలోనే టోకు వ్యాపారం చేసుకోవాలని నిబంధనలు తీసుకుని వస్తే ప్రతి ఒక్కరూ వస్తారు. అందరికీ అనుకూలంగా ఉంటుంది. **- పీరమ్మ, వ్యాపారి**

గనినాడుకు దసరా కళ



బంతిపూల ధరలకు రెక్కలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లాకు దసరా పండగ కళ వచ్చింది. నగరం రద్దీగా మారిపోయింది. దుకాణాలు, మార్కెట్‌లో కొనుగోలుదారులతో నిండిపోయింది. ఈ ఏడాది తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరడంతో, రెండో పంటకు నీరు వస్తోందనే భరోసా ఏర్పడింది. వర్షాధారం కింద సాగు చేసిన పంటలు ఏపుగా పెరిగాయి. వర్షం రావడంతో రబీలో పంటలు సాగు చేయడానికి అనుకూలంగా మారింది. ఈనేపథ్యంలో ప్రతి ఇంటిలో దసరా పండగ కళ వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి బంతి, చామంతి పూలు, అరటికొమ్మలు, పూల కొమ్మలు, అరటి, ఆపిల్, జామ, బత్తాయి, అంజూర, సీతాఫలం పండ్లను తీసుకుని వచ్చారు. పండ్ల ధరలకు రెక్కలు వచ్చినా... వాటిని లెక్కచేయకుండా కొనుగోలు చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. బంతిపూలు కిలో రూ.100, చామంతి పూజలు కిలో రూ.200 పలికాయి.

సిరుగుప్ప: విజయదశమి పండగ ఆచరించేందుకు పూజా సామగ్రి కొనుగోలుతో పట్టణంలో జన సందడి నెలకొంది. శనివారం నిర్వహించే పండగ కోసం గృహాలు, దేవుడి గదులు, వాహనాలు అలంకరించేందుకు అవసరమైన పూలు, మామిడి ఆకులు, అరటి పిలకలు, గుమ్మడి కాయలు, అరటిపళ్లు, తదితర వాటిని పట్టణంలోని గాంధీ కూడలిలో ప్రధాన రహదారి అంచున పెట్టి విక్రయించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సులతో పాటు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఎక్కువ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పట్టణంలో ప్రధాన కూడళ్లు, రహదారుల్లో, కిరాణా అంగళ్లు, దుస్తుల దుకాణాల్లో రద్దీ కనిపించింది.



విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన గుమ్మడి కాయలు, పూలు, మామిడాకులు తదితర పూజ సామగ్రి

రాచనగరి ఉత్సవాలకు విజయనగర కళాకారుడు



కళాకారుడు నాగరాజ్ ఘంటి

హొసపేటె, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల సందర్భంగా మైసూరులో జరిగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా హంపాపట్టణ జానపద కళాకారుడు నాగరాజ్ ఘంటికి దక్కింది. మైసూరు జిల్లా యంత్రాంగం, దసరా ఉత్సవ సమితులు ఉత్సవాల్లో వేదికపైన కళా ప్రదర్శనకు నాగరాజ్ ఘంటికి అవకాశం కల్పించారు. కళాకారుడు మైసూరు ఉత్సవాల వేదికపైన 'సుడుగాడు సిద్ధర కైచళక' (శ్మశాన సిద్ధుల చేతివాటం) అనే కళా ప్రదర్శన చేయనున్నారు. కళాకారుడు నాగరాజ్ ఘంటి ప్రస్తుతం హొసపేటెలో బీఈడీ చదువుకుంటున్నారు. పట్టభద్రుడైనప్పటికీ తమ తాతలకాలం నుంచి వచ్చిన జానపద కళను నాగరాజ్ ఘంటి కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు కళాకారుడు నాగరాజ్ ఘంటి, హంపీ ఉత్సవాలు, జిల్లాస్థాయిలో జరిగే పలు సాంస్కృతిక ఉత్సవాల్లో కళాప్రదర్శన చేసి ప్రశంసలు అందుకున్నాడు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌ను సన్మానించిన కరేగుడ్డ స్వామీజీ

మాన్వి, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే హంపయ్యనాయక్ శుక్రవారం మాన్వి, సిరివార తాలూకాల్లో ఉన్న ప్రముఖ మఠాలను సందర్శించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఆయన మఠాలను సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. మఠాలకు వెళ్లిన శాసన సభ్యుడిని స్వామీజీలు సాదరంగా ఆహ్వానించారు. మఠాల ఆధ్వర్యంలో ఆయన్ని శాలువాలు పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు.

హేమగుడ్డలో దుర్గాపరమేశ్వరి అంబారీ వేడుక



హేమగుడ్డ దుర్గాపరమేశ్వరి అమ్మవారి అంబారీ ఊరేగింపు

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి తాలూకా హేమగుడ్డలో మహానవమి పురస్కరించుకుని దుర్గాపరమేశ్వరి అమ్మవారి అంబారీ ఊరేగింపు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. లోక్‌సభ మాజీ సభ్యుడు హెచ్.జి.రాములు ఉత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, జానపద బృందాల ప్రదర్శనల మధ్య ఊరేగింపు ఆలయం నుంచి పాదగట్టెదాకా సాగింది. శాసనమండలి మాజీ సభ్యుడు హెచ్.ఆర్.శ్రీనాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు

మాన్వి,న్యూస్‌టుడే: శరన్నవరాత్రి పర్వదిన వేడుకలను మాన్వి, సిరివార తాలూకాల వ్యాప్తంగా క్యాంపుల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారికి శ్రీమహిషాసుర మర్దిని అలంకరణ చేశారు. మహిళా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శరన్నవరాత్రి వేడుకల్లో నిర్వహణ క్రమంలో దేవాలయాలు భక్తుల తాకిడితో సందడిని సంతరించుకున్నాయి. భక్తులకు సేవా సమితుల ఆధ్వర్యంలో విశేష ప్రసాద వితరణ చేశారు.

చెళ్లకెర తాలూకాలో కుండపోత వర్షం



చెళ్లకెర పట్టణంలో కాలువలు పొంగడంతో ప్రధాన రహదారి పై ప్రవహిస్తున్న మురుగు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాలో గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలకు అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాంల మట్టి కట్టలు తెగిపోయి పంట పొలాలు, ఉద్యానవన తోటలు నీటమునిగాయి. పట్టణంలో వరద నీటితో కలిసి మురుగునీరు ప్రధాన రహదారిపై ప్రవహించి వ్యాపారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలుగజేసింది. తాలూకాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన నాయకనహట్టిలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఇక్కడ వార్షిక సగటు వర్షపాతం 419 మి.మీ కాగా ఈ సంవత్సరం ఇంతవరకు 984. మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో చెరువులు, కుంటలు నీటితో నిండాయి. రూ.50 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాం మట్టికట్ట కొట్టుకొని పోయింది. వరద నీరు రైతు తిప్పేస్వామికి చెందిన పంట పొలాలను ముంచెత్తింది. మనమైనహట్టి గ్రామం వద్ద రెండు చెక్ డ్యాంలు, ఎన్.మహదేవపురం గ్రామం వద్ద రెండు చెక్‌డ్యాంల మట్టి కట్టలు తెగిపోయి సుమారు రూ.2.50 కోట్ల నష్టం కలిగిందని స్థానికులు పేర్కొన్నారు. చిన్ననీటి పారుదల శాఖ ఏఈఈ అణ్ణప్ప మాట్లాడుతూ తాలూకాలో కుండపోత వర్షాలకు పలు చోట్ల చెక్‌డ్యాంలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని రైతు సంఘం నేత భూతయ్య డిమాండ్ చేశారు.

ఠాణాలో ఆయుధపూజ

మాన్వి,న్యూస్‌టుడే: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయదశమిని పురస్కరించుకుని ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. స్టేషన్ పీఐ వీరభద్రయ్య హిరేమఠ ఆధ్వర్యంలో ఆయుధ పూజను సంప్రదాయ బద్ధంగా ఆచరించారు. ఎస్సై వీరనగౌడ , ఇతర పోలీసులు పంచె, మహిళా పోలీసులు చీరలతో వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

11-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.94	1615.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	24,490	1020
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	27,406	9,025
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	49.398

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఇరకల్‌గఢాలో జనార్దన్‌రెడ్డి కార్యాలయం ప్రారంభం


గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి నియోజకవర్గం ఇరకల్‌గఢాలో శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి తన జనస్పందన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో హామీ ఇచ్చిన మేర తన నియోజకవర్గంలోని అన్నీ రెవెన్యూ సర్కిళ్లలో ఇలాంటి కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ అన్నీ ప్రభుత్వ పథకాలకు చెందిన దరఖాస్తులకు సంబంధించిన సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు. ఇరకల్‌గఢా సర్కిల్ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాసనమండలి మాజీ సభ్యుడు కరియణ్ణ సంగటి, కె.బసవరాజ్ పాల్గొన్నారు.



ఇరకల్‌గఢాలో శాసనసభ్యుడు జనార్దన్‌రెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు

పులకించిన భక్తజనం

బళ్లారి, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. బళ్లారి తాలూకా కృష్ణానగర క్యాంపులో దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.





నిత్యం బెంగళూరు వాసులను ఇక్కట్లపాలు చేసే ట్రాఫిక్

నేషనల్ కళాశాల కూడలిలో కృత్రిమ మేధ ఆధారిత రాకపోకల సూచికలివిగో

కృత్రిమ మేధ చెబితే ఆగాల్సిందే

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరాన్ని పట్టిపీడిస్తున్న వాహన సంచార రద్దీ నియంత్రణకు నగర పోలీసులు కృత్రిమ మేధస్సు(ఏఐ)ను ఆశ్రయించారు. ప్రస్తుతం 60 కూడళ్లలో ఈ నవ్య సిగ్నల్ వ్యవస్థను అమలులోకి తెచ్చారు. ఇదెంతో విజయవంతంగా అమలవుతోందని నగర సంచార విభాగం సంయుక్త కమిషనర్ ఎం.ఎన్.అనుచేత్ తెలిపారు. 60 కూడళ్లలో అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్) అమలు చేస్తున్నామని వివరించారు. నాలుగు కూడళ్ల రహదారుల్లో సంచార రద్దీ ఆధారంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) సమాచారాన్ని సేకరించి సంకేతాలు ఏటీసీఎస్‌కు పంపిస్తాయి. రద్దీ ఉండే ప్రాంతాల్లో వాహన సంచారానికి ఆకుపచ్చ సిగ్నల్ పడితే.. అవి ముందుకు సాగుతాయి. ఏటీసీఎస్ 24 గంటలూ పని చేస్తుంటుంది. బసవనగుడి, జయనగర, జేపీనగర, హెడ్సన్‌కూడలి తదితర ప్రాంతాల్లో నూతన విధానం ఉపయుక్తంగా మారింది. రానున్న జనవరి నాటికి 165 కూడళ్లలో ఆవ్యవస్థను అమలులోకి తెస్తామని సంయుక్త పోలీసు కమిషనర్ అనుచేత్ వివరించారు. సిగ్నల్ వ్యవస్థ కోసం ప్రత్యేక కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో ఏఐ వ్యవస్థ అమలులోకి వస్తే నగరాన్ని పట్టిపీడిస్తున్న సంచార రద్దీ అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

విజయ దుర్గాంబిక..
రణచండిక!



శాకంబరిదేవికి మహిషమర్దిని అలంకారం



గవ్వల అలంకరణతో ప్రసన్న పార్వతి



సింహ వాహని.. త్రిశూలధారిణి మహంకాళి!



బన శంకరిదేవి.. ఉగ్రరూప విన్యాసం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల తొమ్మిదో రోజు దుర్గాంబికా.. రాష్ట్ర వ్యాప్తంగా విశేష పూజలందుకుంది. వివిధ ఆలయాల్లో అమ్మవారి రౌద్రాకారం భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ఓలలాడించింది. భయంకర కోరలతో సింహాన్ని అధిష్ఠించి, చేతిలో త్రిశూలం ధరించి రణచండికగా దేవిని అలంకరించారు. తొమ్మిది మంది రాక్షసులను చంపిన అలసటతో ఉన్న ఆ ఆదిశక్తికి శుక్రవారం శాంతింపజేస్తూ భక్తులు హోమ, జలాభిషేకాలు, నివేదనలతో సేవలందించారు. బెంగళూరు నగరంలోని శాకంబరి, బనశంకరి అమ్మవార్ల పూజలతో భక్తులు తరించారు. కెంపేగౌడనగర్‌లో బండేమాంకాళి రౌద్ర రూపందాల్చి త్రిశూలాన్ని ప్రదర్శించేలా దర్శనమిచ్చారు. హనుమంతనగర శేషమహాగణపతి కోవెలలో ప్రసన్న పార్వతికి కొబ్బరి ఆకుల పందిరి వేశారు. అలంకరణకూ వాటినే వినియోగించారు. మహర్నవమి.. శుభదినం కావడంతో ప్రత్యేక పూజలు చేసి, ఆయుధ పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. బెంగళూరులోని వివిధ మార్కెట్లు విపరీత రద్దీగా కనిపించాయి. పూలు, పండ్ల ధరలు మోతెక్కాయి.



వ్యవసాయ పరికరాలకు పూజ చేస్తున్న కుమార కుటుంబసభ్యులు

కుమార ఆధ్వర్యంలో ఆయుధపూజ

రామనగర : బిడది పరిధి కేతగానహళ్లిలోని తన వ్యవసాయ క్షేత్రం (ఫారం హౌస్)లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. తన సొంత వాహనాలు, ప్రభుత్వ వాహనాలతో పాటు తోటలోని వ్యవసాయ పరికరాలకు కుమారుడు నిఖిల్, కోడలు రేవతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసుకున్నారు. తోటలో పని చేసే కార్మికులు, సిబ్బందికి ఆయన మిఠాయిలు, నూతన వస్త్రాలు, బోనస్‌లు అందించారు.

'హుబ్బళ్లి' కేసుల ఉపసంహరణతో అలజడి

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : పాత హుబ్బళ్లిలో 2022లో జరిగిన ఘర్షణల్లో ఏఐఎంఐఎం నాయకుడు ఆరిఫ్‌తో పాటు పలువురిపై హత్యాయత్నం, మత ఘర్షణల కేసులు నమోదయ్యాయి. దీనికి సంబంధించి 11 ఎఫ్ఐఆర్‌లను 155 మందిపై కేసులు నమోదు చేశారు. పాత హుబ్బళ్లి ఠాణా పోలీసులు, వారి వాహనాలపైనా దాడి జరిగింది. ఇప్పుడు ఆ కేసును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భాజపా ఖండించింది.

వాలీబాల్ ఆటగాళ్లకూ అర్జున్‌లు అందాలి

● 'న్యూస్‌టుడే'తో కోచ్ వాకలపూడి నాగేశ్వరరావు

సింధనూరు, న్యూస్‌టుడే: అన్ని క్రీడల్లో ఆటగాళ్లకు అర్జున్ పురస్కారాలు అందించే ప్రభుత్వం వాలీబాల్‌లో ఉత్తమ ఆటగాళ్లను గుర్తించి ఆ లోటు తీర్చితే తానెంతో ఆనందిస్తా..అది చూడాలన్నదే నా ఆశ అని భారత వాలీబాల్ జట్టు కోచ్, కర్ణాటక వాలీబాల్ సమాఖ్య కార్యదర్శి వాకలపూడి నాగేశ్వరరావు తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ఇటీవలే పారిస్‌లో జరిగిన దివ్యాంగుల పారా ఒలింపిక్స్ క్రీడలకు భారత అథ్లెటిక్స్ జట్టుకు కోచ్‌గా వెళ్లారు. అంతకు ముందే ఆయన ఏషియన్ ఛాంపియన్‌షిప్ సిట్టింగ్ వాలీబాల్ జట్టు కోచ్‌గా కజకిస్తాన్‌కు.. వెనువెంటనే ఈజిప్ట్‌లో జరిగిన సిట్టింగ్ వాలీబాల్ జట్టుకు భారతజట్టు కోచ్‌గా వెళ్లొచ్చారు. చైనాలో జరిగిన రెండు ఏషియన్ గేమ్స్‌కు భారతజట్టు తరపున ఈయనే కోచ్. ఇంతటి భారీ క్రీడా వేదికలకు ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ తరపున కోచ్‌గా వెళ్లిన నాగేశ్వరరావు సింధనూరు వాసే. సింధనూరు దసరా ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు సింధనూరు వచ్చిన ఆయన కొద్దిసేపు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. సమీపంలోని రంగాపూరు క్యాంపు వీరిది. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా నుంచి కర్ణాటకకు వలస వచ్చిన వీరి కుటుంబం ఇక్కడే స్థిరపడింది. క్యాంపులోనే జన్మించిన నాగేశ్వరరావు ప్రాథమిక విద్యను రంగాపూరు క్యాంపు, హైస్కూలు సింధనూరు సుక్కాలపేట ప్రభుత్వ స్కూల్లో చదివారు. పీయూసీ నుంచి ఉన్నత చదువు బెంగళూరులో చదివారు. విద్యార్థి దశలోనే వాలీబాల్ ఆటపై మక్కువతో చాలా పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. గురువుల ప్రోద్బలంతో కేరళలోని త్రివేంద్రం వెళ్లి వాలీబాల్ ఎన్ఐఎస్‌లో డిప్లొమా చేశారు. అనంతరం అంచెలంచెలుగా భారతజట్టు కోచ్ స్థాయికి ఎదిగారు.



దసరా ఉత్సవాలకు వచ్చిన నాగేశ్వరరావును సత్కరిస్తున్న సింధనూరులోని ఓ విద్యా సంస్థ



సింధనూరులోని యువ ఆటగాళ్ల కష్టాలు తెలుసుకుంటున్న నాగేశ్వరరావు

దివ్యాంగులు ఎంతటి సమర్థులో..

పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌పై నాగేశ్వరావు తన అనుభవాలను తెలిపారు. పేరుకు దివ్యాంగులే అయినా వీరు అన్ని అవయవాలు గల సమర్థులకు ఏమాత్రం తీసిపోరన్నారు. రెండు చేతులూ, రెండు కాళ్లూ లేకున్నా హైజంప్‌లో, ఆర్చరీలో వీరు సామాన్య ఆటగాళ్లకు సరి సమాన పాయింట్లతో నిలుస్తున్నారని వివరించారు. ఆర్చరీలో మన సీతల్ దేవి ప్రదర్శన ఎంతోమందిని విస్మయపర్చిందని గర్వంగా చెప్పారు. పారిస్‌లో కంటే చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్ నాకెంతో నచ్చాయని అన్నారు. క్రీడా వేదికల నిర్వహణలో పారిస్ కంటే చైనా చాలా ముందుందని చెప్పారు. అలాంటి బాధ్యతలు భారత్ సగర్వంగా నిర్వర్తించగలదని.. చైనాతో భారత్ సరితూగగలదని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

పిడుగు పడి కార్మికురాలి మృతి

యాదగిరి, న్యూస్‌టుడే : సురపుర తాలూకా చంద్లాపుర గ్రామంలో పత్తి పొలంలో పని చేస్తున్న నింగమ్మ కొంగడి (35) అనే కార్మికురాలిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించింది. భాగ్యమ్మ, బసవరాజ అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. సురపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వానలు తీవ్రం కావడంతో కొప్పళ తాలూకా గిణేరి హులగిలోని ఓ కోళ్ల విక్రయ దుకాణంలోకి వరద నీరు ప్రవేశించి 40కిపైగా కోళ్లు మరణించాయి. దావణగెరె జిల్లా జగళూరు తాలూకా హిరేమల్లనహొళె గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి చెరువు కట్ట తెగిపోయింది. సుమారు 30కి పైగా ఇళ్లలోని వర్షం నీరు చేరింది. ఇళ్లలోకి నీరు రాకుండా చూసుకునేందుకు గ్రామస్థులు రాత్రంతా జాగారం చేశారు. భారీ వర్షానికి దావణగెరె సమీపంలోని కుర్కి గ్రామంలో రైల్వే అండర్‌పాస్ కిందకు నీరు చేరుకుంది. అదే సమయంలో అటుగా వచ్చిన ట్రాక్టర్, ట్రక్కు నీటిలో నిలిచి పోయాయి. చిక్క గంగూరుకు చెందిన పది మంది కార్మికులను ట్రక్కు నుంచి బయటకు తీసుకువచ్చేందుకు స్థానికులు సహకారాన్ని అందించారు.

పండగ వేళ.. మహా ప్రసాదం!

● ప్రత్యేక వంటకాల ఘుమఘుమలు



భలే రుచి.. స్పైసీ మార్గరిటా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మహానవమి, విజయదశమిని పురస్కరించుకుని వినియోగదారులు, ఆహార ప్రియుల కోసం రాజధాని నగరంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక వంటకాలు, పానీయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మామిడి, కమలా, పుచ్చకాయ, తులసి ఆకులు, జామ, ప్యాషన్ ఫ్రూట్ తదితరాలతో చేసిన దేశీయ పానీయాలు, సగ్గు బియ్యంతో చేసి వడలు, పాయసం, స్వీట్ కార్న్‌తో చేసిన కట్‌లెట్లు, గత తొమ్మిది రోజులుగా ఒంటిపూట ఉపవాసం ఉన్న వారిని దృష్టిలో ఉంచుకుని చేసిన వంటకాలు, దద్దోజనం, టమాటా పప్పు నోరూరిస్తున్నాయి. చివరిలో ఫ్రూట్ సలాడ్, డ్రైఫ్రూట్లు, శ్రీఖండ్, వివిధ రుచుల్లో ఐస్‌క్రీమ్‌లతో విందు భోజనాన్ని రాయితీ ధరల్లో అందిస్తున్నామని పలు రెస్టారెంట్ల నిర్వాహకులు వివరించారు. ఇవన్నీ కేవలం శాకాహారాన్ని అందించే రెస్టారెంట్లు. శుక్రవారం ఆయుధ పూజను పురస్కరించుకుని ఆంధ్రాశైలి హోటళ్లలో ప్రత్యేకంగా మాంసాహార వంటకాలను వినియోగదారుల కోసం సిద్ధం చేశారు.



, ఉపవాసం అనంతర అవసరాలకు.. నవరాత్రి వంటకాలు



నోరూరించే కర్బూజా మార్గరిటా



నవరాత్రి థాళి.. ఆరగిస్తే భళే!

భక్తిభావనే ముక్తిదాయకం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ప్రతి మనిషిలో భక్తి ఉంటేనే శాంతి, సామరస్యాలు సాధ్యమని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు పేర్కొన్నారు. ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో దసరా మహోత్సవాలు, నవరాత్రి హోమం, మహారుద్ర యాగం, మేధా దక్షిణామూర్తి పూర్ణాహుతి, సరస్వతి హోమాల్లో మంత్రి కేహెచ్ మునియప్ప, సద్గురువు మధుసూదన సాయితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వాసం, అభ్యాసం ఉన్నప్పుడే సామరస్యం, పరమత సహనం అలవడతాయని, అప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని వివరించారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ సత్యసాయి గ్రామంలో తాము తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మధుసూదన సాయి వివరించారు. సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జిల్లాధికారి పీఎన్ రవీంద్ర, స్థానికులు నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పూజలో సద్గురువు మధుసూధన సాయితో మంత్రి కేహెచ్ మునియప్ప



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి బోసురాజు



తెలుగు వాకిట.. : ఆయుధ పూజను పురస్కరించుకుని బెంగళూరులోని తెలుగు విజ్ఞానసమితి శ్రీకృష్ణదేవరాయ కళా మందిరంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షుడు కె.గంగరాజు, ప్రతినిధి ఎం.ఎస్.చంద్రమోహన్ తదితరులు పూజలో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, శివాజీనగర

గుర్తు తెలియని జంట ఆత్మహత్య

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హడగలి తాలూకా పరిధి మైలారా సమీపం తుంగభద్ర నదీ తీరంలో గుర్తు తెలియని జంట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వీరు ఒకే తాడుకు చెరోవైపు ఉరేసుకున్నారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు, యువతి వివరాలు తెలియరాలేదని హడగలి సీఐ తెలిపారు. గురువారం ఈ జంట మైలారా ఆలయంలో పూజలు చేయించినట్లు యువకుడి జేబులో దొరికిన ఆలయం రసీదు ద్వారా తెలిసింది. ఈ జంట నదీ తీరంలో ఉదయం సంచరించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి జేబులో దొరికిన నాజూకు చరవాణి స్విచాఫ్ చేసిఉంది. రాత్రి కురిసిన వర్షాలతో చరవాణిలో నీరు చేరుకుని ఆన్ కావడం లేదని పోలీసులు తెలిపారు. చరవాణి ఆన్ అయితే వారి ఆచూకీ తెలిసే అవకాశం ఉందని ఘటనా స్థలానికి చేరుకున్న హొళలు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

యడియూరప్ప ఆప్తునిపై దాడి

గదగ, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఆప్తుడు, వైన్ బోర్డు మాజీ అధ్యక్షుడు కాంతిలాల్ బన్సాలీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఏపీఎంసీ మార్కెట్ యార్డు వద్ద గురువారం రాత్రి బైకుపై వెళుతున్న ఆయనను మరో వాహనంలో వచ్చి ఢీకొట్టిన ఆగంతకులు దూషిస్తూ దాడి చేసి పరారయ్యారు. రాజకీయ ప్రత్యర్థులే దాడి చేశారని కాంతిలాల్ వర్గానికి చెందిన వారు ఆరోపించారు. గదగ శహర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భాజపా నాయకుడిపైనా..

మంగళూరు, న్యూస్‌టుడే : కొడియాల్ బైల్‌లో ప్రముఖ బిల్డర్, భాజపా నాయకుడు జితేంద్ర కొఠారి నివాసంలోకి చొరబడి కొందరు యువకులు గురువారం రాత్రి దాడి చేసి పరారయ్యారు. వారిలో అనుష్ శెట్టి, అంకిత్‌శెట్టి అనే వ్యక్తులను శుక్రవారం ఉదయం బర్కె ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలని పోలీసులు తెలిపారు.

నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా శ్రీరాంపురం, బెలగూరు గ్రామాల్లో కారులో వచ్చిన ముగ్గురు దుండగులు 3 దుకాణాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసి రూ.22 వేలను నకిలీ ఫోన్ పే యాప్ ఉపయోగించి మోసం చేసిన ఉదంతమిది. పరారైన వారిని శ్రీరాంపురం పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ శుక్రవారం తెలిపారు.




పడమటి కనుమల్లోని కుమారపర్వత శ్రేణులు



తనిఖీ కేంద్రానికి చేరువలో విశ్రాంతి కోసం గుడారాలు

కుమార పర్వతం.. విహార పర్వం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పడమటి కనుమల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే యువతకు కొండలెక్కడం ఓ సరదాగా మారింది. ఈసారి దసరా వేళ కొండలెక్కే (ట్రెక్కింగ్) వారి కోసమే అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చేయడంతో అత్యధికులు సాహస పర్యాటకానికి నడుం బిగించి కదిలారు. ఈ అంశంపై ఇన్నాళ్లూ కొనసాగిన నిబంధనలను తొలగించేశామని ఇటీవల అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే అధికారికంగా వెల్లడించాక ఇటీవలే పేర్ల నమోదుకు శ్రీకారం చుట్టారు. నిబంధనలు ఎత్తివేసిన గంటలోపు బెంగళూరు, మైసూరు, మంగళూరు, ధార్వాడ్, ముంబయి, హైదరాబాద్‌లకు చెందిన మూడు వేల మంది ఇలా ముందుకొచ్చారని అధికారులు తెలిపారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో కుమారపర్వతం (పుష్పగిరి)పై ప్రమాదాలను శంకించి మే మొదటి వారం నుంచి సెప్టెంబరు 30 వరకు నిషేధించారు. వేసవి అనంతరం అధిక వర్షాలు ఆగిపోయాక. . పర్వతారోహణకు అనుమతించారు. దసరా సెలవులూ కలసి రావడంతో కొండలు, గుట్టలు ఎగబాకి శిఖరాగ్రానికి చేరుతున్నారు. కీకారణ్యంలో 28 కిలోమీటర్ల ప్రయాణానికి అటవీ శాఖ అధికారులు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. సోమవారపేట నుంచి ఈ నడక మొదలవుతుంది. పర్వతాగ్రానికి చేరాక.. మరో వైపు ప్రఖ్యాత కుక్కే సుబ్రహ్మణ్యస్వామి ఆలయం చూడొచ్చు. అక్కడికెళ్లి పూజల అనంతరం సాహసికులు వెనుదిరుగుతుంటారు. పుష్పగిరి వన్యజీవుల అభయారణ్యంలో భాగమైన ఉష్ణమండల వర్షారణ్యంలో ప్రయాణం ఏమంత సులువు కాదు. ఈ ప్రయాణం మొత్తం నడక మార్గమే. ఏడు కిలోమీటర్లు ముందుకుసాగాక.. భీమాస్‌రాక్ (భీమగిరి) చేరుకోవడం ఓ మైలురాయి. పర్వతం సముద్రమట్టానికి 5,626 అడుగులో ఎత్తున విరాజిల్లుతోంది.



అత్యంత ఎత్తైన శిఖరంపై యువత ఉత్సాహం

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

రంగోలితో రతన్ టాటాకు నివాళి



రతన్ టాటా చిత్రం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు నమ్మ మెట్రో వినూత్నంగా నివాళులర్పించింది. నగరంలోని మెజిస్టిక్ మెట్రో స్టేషన్ ఆవరణలో కళాకారులు వివిధ రంగుల ముగ్గులతో రతన్ టాటా ముఖచిత్రాన్ని తీర్చిదిద్దారు. ఆ చిత్రం ప్రయాణికులను విపరీతంగా ఆకట్టుకుంది. వారు ఆయన చిత్రం వద్ద నివాళులర్పించారు. చిత్రం వేయడానికి మూడు గంటల సమయం పట్టినట్లు కళాకారులు తెలిపారు.

కన్నడ రాజ్యోత్సవంలో ధ్వజారోహణ తప్పనిసరి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవాలకు ప్రతి సంస్థ తప్పనిసరిగా కన్నడ పతాకాన్ని ఎగుర వేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యా సంస్థలు, ఐటీ బీటీ కంపెనీలు, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. కర్ణాటకలో కన్నడ రాజభాష అనే విషయం తెలిసిందేనన్నారు. దాన్ని కాపాడుకునే చర్యల్లో భాగంగా కన్నడ పతాకం, రాజ్యోత్సవాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఈ ఆదేశాలు జారీ చేశామని ఆయన స్పష్టం చేశారు.



కెంగేరి: మహిషాసురమర్దినిగా ఉడుపి చిన్నికృష్ణుడు



జాలహళ్లి: కేజీహళ్లిలో విశేషాలంకారంలో పోలేరమ్మ తల్లి



చిత్రదుర్గం: పూలు, పండ్లతో బరగేరమ్మకు అలంకారం



బెంగళూరు: ఆయుధపూజలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సిబ్బంది



బెంగళూరు: అమ్మవారి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



చిక్కబళ్లాపుర: దుర్గా నమస్కారాలు చేస్తున్న సమితి ప్రతినిధులు

జయములీయవే అమ్మా భవాని

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో, నందిని లేఅవుట్‌లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. కళాకారులు, విద్యార్థులు కలిసి అమ్మవారి జీవిత చరిత్రను నృత్య రూపకంలో ప్రదర్శించారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసంతో పాటు మంత్రులు, మాజీ మంత్రుల ఇళ్లలో ఆయుధ పూజ నిర్వహించారు. సదాశివనగరలోని డీకే శివకుమార్ ఇంట్లో ఆయన తన భార్య ఉషాతో కలిసి దేవతామూర్తులు, వాహనాలకు పూజలు చేశారు. సిబ్బందికి కొత్త దుస్తులు, మిఠాయిలు పంచారు. స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వాహనాలను అలంకరించి పూజ నిర్వహించారు. మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్య నాయుడు నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు.



బెంగళూరు: అమ్మవారికి పూజ చేస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఉషా దంపతులు



బెంగళూరు: మైసూరు ప్యాలెస్ నమూనాలో బొమ్మలకొలువు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: శరన్నవ ఉత్సవాల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో చేసే పులి నృత్యాన్ని 'మార్నెమి'గా వ్యవహరిస్తారు. వీధులు, మైదానాలు, ఆడిటోరియాల్లో పులి వేషధారులు నృత్యంతో పోటీపడతారు. ఉత్తమ ప్రదర్శనలకు చక్కని బహుమతులు ఉంటాయి. దసరా ప్రారంభం రోజున ఒంటికి రంగు వేసుకునే కళాకారులు ఉత్సవాలు పూర్తయ్యే వరకు వాటిని తీయరు. ఇటీవల పురుషులతో పాటు మహిళలూ నృత్యానికి సై అంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి కొంతసేపు నృత్యం చేసి, స్థానికులు ఇచ్చే గౌరవ ధనాన్ని, కానుకలను తీసుకువెళ్లే బృందాలు దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో అనేకం ఉన్నాయి. శరన్నవ రాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఇంటింటా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకుంటున్నాయి.

బెంగళూరు (జాలహళ్లి): నగరంలోని కమ్మగుండనహళ్లిలో ప్రసిద్ధి చెందిన పోలేరమ్మ ఆలయంలో నవమి ఉత్సవాలు శ్రీరామ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. తొమ్మిది రోజులు అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, మహా మంగళహారతి సమర్పిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవార్లను వందల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శెట్టిహళ్లిలోని శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో భాజపా అధ్యక్షుడు బి.సురేష్ దంపతులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిక్కబళ్లాపుర: నాడహబ్బ దసరా సందర్భంగా చిక్కబళ్లాపుర మైదానంలో పతంజలి యోగా విద్యా సమితి ప్రతినిధులు దుర్గా నమస్కారాలు చేశారు. ప్రతి ఏటా దసరాకు సమితి ప్రతినిధులు దుర్గా సమస్కారాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు దుర్గా నమస్కారాలు, వ్యాయామం, ఆసనాల ప్రాధాన్యతను వివరించారు. ప్రతినిధులు కాంతరాజ్, రత్నవర్మ, రామకృష్ణారెడ్డి, సుధ, సుభాషిణి, శైలజ, లీలావతి, అనిత, గాయత్రి పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా ఉడుపి శ్రీకృష్ణుడు

బెంగళూరు (కెంగేరి): ఉడుపిలోని శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామి మూల విగ్రహాన్ని మహిషాసురమర్దినిగా అలంకరించారు. పర్యాయ పుత్తిగెమఠం నేతృత్వంలో మఠాధిపతి సుగుణేంద్రతీర్థ గోపాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. కెంగేరి ఉపనగరం కర్ణాటక హౌసింగ్ బోర్డు కాలనిలోని సత్యగణపతి ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు.

చిత్రదుర్గంలో సంబరాలు..

చిత్రదుర్గం: చిత్రదుర్గంలో ఆయుధ పూజ ఘనంగా జరిగింది. జిల్లా పాలనాధికారి, జడ్పీ, బెస్కాం తదితర కార్యాలయాల్లో వాహనాలకు పూజలు చేశారు. గ్రామ దేవతలు బరగేరమ్మ, ఉత్సవాంబ, ఏకనాథేశ్వరి, చౌడేశ్వరి, మారమ్మలను వివిధరకాల పూలు, పండ్లు, కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శరణ సంస్కృతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన నేపథ్యగాయకుడు రాజేశ్‌కృష్ణన్ నైట్స్ వీక్షకులను ఆకట్టుకుంది. గాయని జ్యోతి రవిప్రకాశ్‌తో ఆయన ఆలపించిన పాటలు రంజింపజేశాయి.



బెంగళూరు: అలరించిన యక్షగాన నృత్యం

అట్టహాసంగా తుమకూరు దసరా

తుమకూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవంలో భాగంగా శుక్రవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన మినీ మారథాన్‌ను హోంమంత్రి పరమేశ్వర్ పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. యువకుల్లో క్రీడలపై ఆసక్తి పెంచడానికే పోటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. త్వరలోనే ఇక్కడ అంతర్జాతీయ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం రూ. 58 కోట్లతో మహాత్మగాంధీ క్రీడాంగణాన్ని ఆధునీకరించడం జరిగిందని చెప్పారు. మారథాన్‌లో విజేతలుగా గురు ప్రసాద్, సందీప్, వెంకటేశ్, మణికంఠ, లక్ష్మీశ, అవదీష్ నిషాద్, డీఆర్ స్మిత, ఎం. రాశి, ప్రియాంక జయశ్రీ, సానికా, సౌమ్య నిలిచారు. కార్యక్రమంలో జిల్లాధికారి శుభాకల్యాణ్, జడ్పీ సీఈవో జి.ప్రభు, ఎస్పీ కేవీ అశోక్, పాలికె కమిషనర్ అశ్విజ, అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి, తహసీల్దార్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మారథాన్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి పరమేశ్వర్, కలెక్టర్ శుభాకల్యాణ్, సీఈఓ ప్రభు తదితరులు



ఆకట్టుకున్న కుస్తీ పోటీ

తుంగాలో చిక్కిన వ్యక్తికి ప్రాణభిక్ష

శివమొగ్గ, న్యూస్‌టుడే: శివమొగ్గ శివారులోని తుంగా నది మధ్యలో ఉన్న బండరాళ్లపై చిక్కుకున్న గోపాల్ (35) అనే వ్యక్తిని అగ్నిమాపక దళ సిబ్బంది గురువారం ఉదయం రక్షించారు. నది మధ్యలో ఉన్న రాతి బండలపైకి బుధవారం గోపాల్ వెళ్లాడు. భారీ వర్షం కురవడంతో నీటి ప్రవాహం పెరిగింది. బయటకు రాలేక కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకదళ సిబ్బంది కార్యాచరణ నిర్వహించి ఆయనను కాపాడారు.



రజత్‌కంకర్‌తో పతక విజేతలు

అఖిలభారత పికల్‌బాల్‌లో సత్తా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అఖిలభారత పికల్‌బాల్ పోటీలో కర్ణాటక క్రీడాకారులు వేర్వేరు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారని కర్ణాటక పికల్‌బాల్ సంఘం సంస్థాపకుడు రజత్‌కంకర్ గురువారం తెలిపారు. అఖిలభారత, హిమాచల్ పికల్‌బాల్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల పతక సాధన వివరాలను ఆయన తెలిపారు. అండర్-19 డబుల్స్ బాలుర విభాగంలో నిరప్రజ్-ఆదిత్యప్రదీప్ జంట స్వర్ణ, సింగిల్స్‌లో నిరుప్రజ్ రజత పతకాలు సొంత చేసుకున్నట్లు వెల్లడించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కావ్య, ఆకాష్ కాంస్యం, 35+ విభాగం డబుల్స్ పోరులో కిరణ్‌కుమార్, ఆశా పసిడి, మిక్స్‌డ్ డబుల్స్‌లో రఘుగౌడ, పూర్ణిమ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 50+ పురుషుల విభాగంలో లోకేష్, నాగేంద్ర రజత పతకం సాధించారని ఆయన వివరించారు.

బాలల సృజనాత్మకత అద్భుతం



మేళాలో బాలలతో వీరేంద్రహెగ్గడే తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సాలిగ్రామ బాలల మేళాలో బాల కళాకారుల ప్రతిభ, వాక్చాతుర్యం అభినయనం, ప్రసంగాలు అద్భుతమని ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే తెలిపారు. గురువారం ధర్మస్థల ప్రవచన మండపంలో సువర్ణమహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బాలల మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యక్షగాన కళను అభివృద్ధి చేసి భావి తరాలకు అందించే సమర్థవంతులని బాలలను కొనియాడారు. పాఠశాలలు కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో యక్షగాన కళను ప్రోత్సహించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. 1975 ఆగస్టు 10న సాలిగ్రామలో దివంగత కార్కడ శ్రీనివాస, శ్రీధరహందే నేతృత్వంలో మొదలైన బాలల మేళా నేడు సువర్ణ మహోత్సవాన్ని జరుపుకోవం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బాలల మేళా ట్రస్టు కార్యాధ్యక్షుడు కె.మహేష్ ఉడుప, డైరెక్టర్ హెచ్.సుజయేంద్రహందే, జనార్దన హెగ్గడే డి.సురేంద్రకుమార్, డి.హర్షేంద్రకుమార్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని చిరుత మృతి

ఉడుపి, న్యూస్‌టుడే: సౌపర్ణిక నది సమీపంలో నాడ గ్రామం వద్ద రైలు ఢీకొని ఐదేళ్ల వయసు మగ చిరుత మృతి చెందింది. చిరుత కళేబరాన్ని శుక్రవారం ఉదయం గుర్తించారు. కుందాపుర వలయం అధికారులు కళేబరానికి మరణోత్తర పరీక్షలు నిర్వహించి అంత్యక్రియలు చేశారు.

కోలుకుంటున్న ప్రమోద్ మధ్వరాజ్

ఉడుపి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన మాజీ మంత్రి ప్రమోద్ మధ్వరాజ్ (55) కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్, నిమోనియాతో బాధపడుతున్న ఆయనను గత బుధవారం ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని, త్వరలో ఇంటికి పంపిస్తామని వైద్యులు తెలిపారు.

వైభవంగా విజయదశమి



బాగలూరు: విశేషాలంకారంలో కోటమారియమ్మ



బాగలూరు: స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

బేరికె, బాగలూరు, (న్యూస్‌టుడే): దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బేరికెలోని భూ, నీలా సమేత ప్రసన్న వేంకటరమణస్వామి, శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శూలగిరి యూనియన్ యళచేపల్లిలోని పార్వతీ పుట్ట లింగేశ్వర ఆలయంలో ధర్మకర్త సాధు మాత వెంకటమ్మ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బాగలూరు గ్రామ దేవత కోట మారియమ్మ ఆలయంలో అమ్మవారికి వివిధరకాల అభిషేకాలు చేసి దివ్యంగా అలంకరించి పూజలు చేశారు. బ్రాహ్మణ వీధిలో వెలసిన రామలింగ చౌడేశ్వరి ఆలయంలో బాగలూరు తెలుగు దేవాంగ వంశస్థుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రపంచ చదరంగం పోటీలకు ఎంపిక

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: తెలంగాణ రాజధాని హైదరాబాదులో 10వ తేదీ సాయంత్రం ముగిసిన 37వ జాతీయ అండర్-11 చదరంగం పోటీలో నగర బాలికలు ప్రతీతి, ఆద్య గౌడలు మొదటి రెండు స్థానాలు సాధించినట్లు కర్ణాటక చెస్ సంఘం సాధారణ కార్యదర్శి తేజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సాధనతో 2025లో జరగనున్న అండర్-12 ప్రపంచ, ఆసియా ఛాంపియన్‌షిప్‌తో పాటు ఇతర అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు వారు అర్హత పొందినట్లు వెల్లడించారు. బీఈఏఎంఎల్ పబ్లిక్ స్కూల్‌లో ప్రతీతి, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆద్య చదువుతున్నట్లు ఆయన వివరించారు.



గెలిచిన కప్‌లతో ప్రతీతి, ఆద్య

నగరంలో పండ్లు, కూరగాయల ధరలు (హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

		పండ్ల ధరలు
బీన్స్- 115	ఆలుగడ్డ-45	ఆపిల్ వాషింగ్‌టన్-315
క్యారెట్-75	ఉల్లిగడ్డలు(మేలు రకం)-85	సిమ్లా అపిల్-155
బీరకాయలు-40	ఉల్లిగడ్డలు(సాధారణం)-50	గ్రీన్ అపిల్-335
క్యాబేజీ-20	తెల్లగడ్డలు-390	అరటి పండ్లు -55
కాలిఫ్లవర్ (ఒక్కోటి)-25	సాంబారు ఉల్లి-120	సపోటా-45
సొరకాయ-35	బీట్‌రూట్-25	పైనాపిల్-40
దొడ్డకాయలు-30	వంకాయలు-35	బొప్పాయి-45
పొట్లకాయ-35	బెండకాయలు-28	ఆరంజి-80
టమాటా(నాటు)-110	ముల్లంగి-40	బత్తాయి-75
టమాటా-95	నిమ్మకాయ-270	
గుమ్మడి-55		

-న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

బాబోయ్ ట్రాఫిక్ జామ్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయుధ పూజ పురస్కరించుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహన సంచార రద్దీ నెలకొంది. కె.ఆర్.మార్కెట్, కె.ఆర్.పురం, కోరమంగల, టీన్ ఫ్యాక్టరి, హెబ్బాళ్, యలహంక, యశ్వంతపుర, విజయనగర, గూరగుంటపాళ్య, దాసరహళ్లి, పీణ్యా, కళ్యాణనగర, మారత్తహళ్లి, సిల్క్‌బోర్డు, బొమ్మనహళ్లి, సర్జాపుర తదితర ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ నెలకొందని సంచార పోలీసులు వాపోయారు. నియంత్రణకు వారు శ్రమించడం కనిపించింది.

అనధికార పీజీల మూసివేత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని అనధికారిక ప్రైవేటు వసతిగృహాల (పీజీ) మూసివేతకు పాలికె శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2,320 పీజీలకు నోటీసులు జారీ చేసింది. 21 పీజీలకు తాళాలు వేసి సీజ్ చేసినట్లు పాలికె ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్ కిశోర్ తెలిపారు. ఎనిమిది విభాగాల ఆరోగ్యాధికారులు ఆయా ప్రాంతాల్లోని పీజీలను తనిఖీ చేశారు. పాలికె నుంచి వాణిజ్య లైసెన్స్ పొందకుండా, నిబంధనలకు తిలోదకాలిస్తూ, స్వచ్ఛతను పాటించకపోవడం తదితర కారణాలతో కొన్నింటిని మూసి వేసినట్లు ఆయన తెలిపారు. పాలికె పరిధిలో 2,193 పీజీలుండగా వాటిలో 1578 నిబంధనలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. వసతిగృహాల లోపల, వెలుపల ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిలో నివసించే ప్రతి వ్యక్తికి 70 చదరపు అడుగులు ఉండాలన్న నిబంధనలు ఉన్నాయన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని, తగినన్ని స్నానాల గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, 24 గంటలూ భద్రత సిబ్బంది ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అన్నింటికీ మించి ఎఫ్ఎస్ఎస్ఐఏ నిబంధనల ప్రకారం శుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలన్నారు. పీజీ కేంద్రాల్లో సురక్షిత చర్యలు లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



తాళం వేస్తున్న పాలికె అధికారులు

పేదలకు సేవ అభినందనీయం



పార్తిబన్‌రాజన్ దంపతులకు సత్కారం

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే: ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ, పాతికేళ్లుగా వందలాది పేదలకు వివిధ రకాల సేవలందిస్తున్న కువెంపునగర వార్డు మాజీ కార్పొరేటర్ వి.వి.పార్తిబన్‌రాజన్ అభినందనీయులని కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు సంతోష్‌రాజన్ అన్నారు. ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పార్తిబన్‌రాజన్ దంపతులను ప్రత్యేకంగా సత్కరించి మాట్లాడారు. సమాజంలోని పేదల ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ సహకరించినప్పుడే పేదరికం ఉండదన్నారు. అందుకే మహనీయులు మానవ సేవయే మాధవ సేవని చెప్పారన్నారు. తప్పులు చేయడం మానవ సహజమని, వాటిని గుర్తించి సరిచేసుకున్నప్పుడే గొప్పవాళ్లు అవుతారన్నారు. కార్యక్రమములో వివిధ సంఘాల ప్రతినిధులు, బీబీఎంపీ మేనేజర్ ఆర్యరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి

కనకపుర, న్యూస్‌టుడే: నీటి తొట్టెలో పడిన బంతిని తీసుకునే ప్రయత్నంలో అందులో పడి ప్రద్విన్(3) అనే బాలుడు మృతి చెందిన ఘటన కనకపుర తాలూకా ఉయ్యంబళ్లి సమీపంలోని అడకెహళ్లలో చోటుచేసుకుంది. బాలుడు కనిపించక పోవడంతో తల్లిదండ్రులు సింధు, శ్రీనివాస్ దంపతులు గాలించగా తొట్టెలో మృతదేహం కనిపించింది. కనకపుర గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిందితులకు జీవితఖైదు

దావణగెరె, న్యూస్‌టుడే: తాకట్టు పెట్టిన తన నగలను విడిపించాలని కోరిన డి.సుమ అనే గృహిణిపై కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త గిరిధర్, అత్త లీలాబాయి, మామ హాలప్పకు జీవితఖైదు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. హొన్నాళి తాలూకా చిక్కబసూరు తాండాలో 2018 జనవరి 17న ఈ ఘటన చోటుచేసుకుంది. నేరం రుజువు కావడంతో నిందితులకు జీవితఖైదుతో పాటు తలా రూ.38 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

హత్యాచారం.. హంతకుడి అరెస్టు

కోలారు, న్యూస్‌టుడే: మానసిక రోగిపై హత్యాచారానికి పాల్పడి పరారైన ఆటో డ్రైవరు సయ్యద్ సుహేల్ (35)ను అరెస్టు చేసి, న్యాయ నిర్బంధానికి పంపించినట్లు ఎస్పీ బి.నిఖిల్ విలేకరులకు తెలిపారు. చింతామణి తాలూకా మురుగమల్లకు చెందిన నిందితుడు గత నెల 25న ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడు. పోలీసులు 125 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేశారని ఎస్పీ వెల్లడించారు.

ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడి...

మంగళూరు, న్యూస్‌టుడే: మంగళూరు ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మొయినుద్దీన్ బావా సోదరుడు ముమ్తాజ్ అలి ఆత్మహత్యకు సంబంధించి ప్రధాన నిందితుడు అబ్దుల్ సత్తార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి వెళ్లిన సీసీబీ పోలీసులు నిందితుడిని పట్టుకొని నగరానికి తీసుకువచ్చారు. శ్రీమంతులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ చేయించిన ఆరోపణలు నిందితుడు అబ్దుల్ సత్తార్‌పై ఉన్నాయి.

ఆరోపణలపై ఇద్దరి..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని మూడు ఓమ్నీ వాహనాలకు నిప్పు పెట్టారనే ఆరోపణలపై మంజు, స్వామినాథ్ అనే వ్యక్తులను సంజయ్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. గత ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు నిందితులు వాహనాలకు నిప్పు పెట్టి పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నకిలీనోట్ల చలామణిలో ఐదుగురి...

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: నకిలీ నోట్ల చలామణి ఆరోపణలపై బళ్లారి వాసి అబ్దుల్ హుసేన్, కేరళ నివాసులు ప్రసిద్, నూరుద్దీన్ అస్కర్, మహ్మద్ అఫ్సాన్, ప్రయాశ్ అనే నిందితులను హలసూరు గేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5 లక్షల విలువచేసే నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాణసంచా స్వాధీనం

ఉడుపి, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా తన నివాసంలో బాణసంచా నిల్వ ఉంచిన దత్తాత్రేయ సేట్ అనే వ్యక్తిని బైందూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ఇంటి నుంచి రూ. 4 లక్షల విలువైన బాణసంచాను జప్తు చేసుకున్నారు. కొద్ది నెలలుగా ఆయన తన నివాసం నుంచే బాణసంచా విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు.

6137 కేసుల నమోదు

బెంగళూరు (యశ్వంతపుర): నగరంలో సంచార నిబంధనల ఉల్లంఘనపై 6,137 మంది ఆటోడ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రయాణికులు పిలిచిన ప్రదేశాలకు వచ్చేందుకు నిరాకరించడం, ఎక్కువ అద్దె డిమాండ్ చేయడం, ప్రయాణికులను ఎక్కించుకుని మధ్యలో బెదిరించి నగదు, నగలు దోచుకోవడం తదితర నేరాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సంచార పోలీసులు తనిఖీలు చేపట్టారు. యువతులను ఆటోడ్రైవర్లు వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తనిఖీలు కొనసాగిస్తామని సంచార విభాగం సంయుక్త పోలీసు కమిషనర్ అనుచేత్ తెలియజేశారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మాన్వి,న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే హంపయ్యనాయక్ శుక్రవారం మాన్వి, సిరివార తాలూకాల్లో పరిధిలో ఉన్న ప్రముఖ మఠాలను సందర్శించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఆయన మఠాలను సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. మఠాలకు వెళ్లిన శాసన సభ్యుడిని స్వామీజీలు సాదరంగా ఆహ్వానించారు. మఠాల ఆధ్వర్యంలో ఆయన్ను శాలువాలు పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌ను సన్మానించిన కరేగుడ్డ స్వామీజీ

పాముల సంరక్షకులకు పరికరాల వితరణ

మాన్వి,న్యూస్‌టుడే: తమ ప్రాణాలను పణంగా పెట్టి పాములను పట్టుకుని వాటిని సంరక్షిస్తున్న పట్టణానికి చెందిన స్నేక్‌స్నేహర్స్‌కు పరికరాలను వితరణ చేశారు. ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ అంబికా మధుసూదన్ పాములు పట్టుకునే పరికరాలను సమకూర్చారు. పాముల సంతతి నశించిపోకుండా కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తున్న రమేష్ మిత్రుల బృందానికి ఆమె సాధనాలను అందించారు.



పరికరాలు వితరణ చేస్తున్న డాక్టర్ అంబికా మధుసూదన్

ఇంధనం సరిపోక విమానం వెనక్కి..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి గోవాకు వెళుతున్న ఇండిగో విమానంలో ఇంధనం తక్కువగా ఉందని గుర్తించిన పైలెట్ కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి తిరిగి తీసుకువచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన అక్టోబరు ఎనిమిది సాయంత్రం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి ఆ రోజు సాయంత్రం 5.50కి బయలుదేరిన విమానం గోవా దబోలిమ్ విమానాశ్రయంలో 6.45కు దిగవలసి ఉంది. ఆ సమయంలో గోవాలో భారీ వర్షం కురుస్తూ ఉండటంతో కనబడటం లేదన్న సమాచారం రావడం, ముందుకు వెళ్లేందుకు ఇంధనం తక్కువగా ఉన్నట్టు గుర్తించి మళ్లీ విమానాన్ని బెంగళూరుకు తీసుకువచ్చారు. విమానంలో ఆ సమయంలో 222 మంది ప్రయాణికులు ఉన్నారు. బెంగళూరుకు వచ్చి ఇంధనాన్ని నింపుకొన్న విమానం అదే రోజు రాత్రి 11 గంటలకు గోవాకు చేరుకుంది.

జననీ శివకామిని.. శుభకారిణి

రాయచూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. వేడుకలు ముగిసిపోతుండటం, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు కావడంతో శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. కీర్తనలు ఆలపించారు. సృష్టికి మూలమైన జగజ్జనని ఆలయాల నిర్వాహకులు దివ్యంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలు మండపాల్లో ప్రతిష్ఠించిన కాత్యాయినికి వైభవంగా శోభాయాత్ర జరిపారు. నిజలింగప్ప కాలనీ మిలినీయం ఉద్యానవనంలో భ్రమారంబ తల్లిని పసుపుతో సుందరంగా అలంకరించారు. గద్వాల్ రహదారిలోని మాతా మహాలక్ష్మి, కాళికాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సృష్టికర్త చాముండేశ్వరి రూపం ఆకట్టుకుంది. గణేష్ కాలనీలోని ఈశ్వర దేవస్థానంలో 1008 మంది ముత్తయిదువులకు ఒడి బియ్యం పెట్టారు. సోమవారపేట హిరేమఠ స్వామి రాయచోటి వీరశివాచార్య, దేవాలయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ పాటిల్ మిర్జాపూర నేతృత్వంలో వివిధ పూజలు జరిగాయి. ఉప్పారవాడి లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో గురువారం రాత్రి దేవదేవుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పూజలు చేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. గూడ్‌షెడ్ ప్రదేశంలోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చాముండేశ్వరిగా అమ్మవారు



అశ్వవాహనం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



భ్రమరాంబ ఆలయంలో పూజలు

కళాకారులకు చేయూత అవసరం

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు సాంస్కృతిక ఉత్సవాలు, కార్యక్రమాలు, కళాకారులకు చేయూత ఇవ్వాలని సీనియర్ కౌన్సిలర్, రాయచూరు కోట అధ్యయన సమితి గౌరవాధ్యక్షుడు జయణ్ణ అన్నారు. నగరసభ, కోట అధ్యయన సమితి, తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ కలిసి గురువారం రాత్రి బస్టాండ్ ఎదురుగానున్న మక్కా ధర్వాజ్ కోట ఆవరణలో బహుభాషా కవిగోష్ఠి ఏర్పాటు చేశాయి. దీన్ని ప్రారంభించిన జయణ్ణ మాట్లాడుతూ ఏటా దసరా పండగను విశిష్టంగా నిర్వహిస్తూ నగరసభ ప్రజలు మన్ననలు అందుకుంటోందన్నారు. ఇదే తరహాలో సాంస్కృతిక రంగానికి వెన్నుదన్నుగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరసభ కమిషనర్ గురు సిద్ధయ్య హీరేమఠ మాట్లాడుతూ రాష్ట్రంలో బీదర్ తర్వాత రాయచూరులోనే కోటలు అధికంగా ఉన్నాయని గుర్తుచేశారు. కోటలను పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు అభివృద్ధి పనులు జరగాలని ఆకాంక్షించారు. వివిధ భాషల కవుల రచనలు ఆలకించేందుకు గోష్ఠి పెట్టడం అభినందనీయమన్నారు. రాయచూరు తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ బేవినబెంచి, దళిత సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాయరాజ్ మర్చటాల్, సాహితీవేత్త మహంతేశ్ మస్కి మాట్లాడారు. 25 మంది కవులు గోష్ఠిలో తమ రచనలు వినిపించారు.



ప్రసంగిస్తున్న జయణ్ణ

13వ సాంస్కృతిక సంభ్రమం

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక రంగ మందిరంలో 13న సాంస్కృతిక సంభ్రమం, సంగీత నృత్యోత్సవం, రంగ సిరి పురస్కారాల ప్రదానోత్సవాలు ఉంటాయని రంగసిరి సాంస్కృతిక కళా బృందం అధ్యక్షుడు రంగస్వామి వెల్లడించారు. ఆయన శుక్రవారం పత్రికా భవన్‌లో పాత్రికేయుల సమావేశంలో వివరాలు తెలిపారు. కన్నడ, సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగే ఈ కార్యక్రమాన్ని రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ ప్రారంభిస్తారన్నారు. రంగ భూమి, సాహిత్యం, బయలాట, సంగీతం, విద్య, సేవా రంగాల్లో ప్రతిభ చాటిన 16 మందికి పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. కళాకారులు జిందప్ప, నరసింహులు, సరితా, విజయకుమార్, జయప్ప, రఘుపతి పూజారి దిన్ని, చిదానంద సాలి, సత్యవతి, ఝాన్సీరాణి, కవిత, శారదా పూజార్ పాల్గొంటారన్నారు. కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కళాకారులు గుండల్లి, రమేష్ తదితరులున్నారు.



వివరాలు తెలుపుతున్న రంగస్వామి

రతన్ టాటా గొప్ప ఆర్థిక, సామాజిక సంస్కర్త

మాన్వి,న్యూస్‌టుడే: రతన్‌టాటా చేసిన సామాజిక సేవ, ఆర్థిక సంస్కర్తగా, వ్యాపార దిగ్గజంగా దేశానికి ప్రపంచ వ్యాప్తంగా కీర్తప్రతిష్ఠలను తీసుకొచ్చారని కమ్మవారి సంఘం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కమ్మవారి సంఘం సముదాయ భవనంలో టాటాకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ ప్రథమాధ్యక్షుడు వెల్లంకి రవిబాబు మాట్లాడుతూ రతన్‌టాటా చేసిన ప్రతి పనిలో, వ్యాపారంలో దేశ ప్రజల సంక్షేమం దాగి ఉందన్నారు. టాటా వ్యాపార సంస్థలను ప్రపంచదేశాల్లో నెలకొల్పి ఎందరికో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించిన గొప్ప ఆర్థిక మేధావిగా కొనియాడారు. కాకతీయ శిక్షణ సంస్థ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి టి.రామకృష్ణ, కమ్మవారి సంఘం కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడారు. ఉపాధ్యక్షుడు పుట్ట ప్రసాద్, ఉమామహేశ్వరరావు, కోశాధికారి మల్లికార్జున, సభ్యులు జి.సుబ్బారావు చౌదరి, బి.టి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఫణికుమార్, రాంబాబు, డి.రామకృష్ణ, సత్యనారాయణ, కృష్ణమోహన్‌రావు, సర్వేశ్వరరావు, సోనిచరణ్ పాల్గొన్నారు.



టాటా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కమ్మవారి సంఘం సభ్యులు

టీటీ రుసుం తగ్గింపునకు వినతి

రాయచూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ ఆడేందుకు నిర్ణయించిన రుసుమును తగ్గించాలని జిల్లా టీటీ సంఘం జిల్లా పాలనాధికారి నితీష్‌కు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కేకుడా, కార్యదర్శి ఈరణ్ణ, కోశాధికారి ఆర్.ఈరణ్ణ జిల్లా పాలనాధికారిని కలసి వినతిపత్రం అందజేశారు. నెలవారీ ఫీజు విద్యార్థులకు రూ.600, ఇతరులకు రూ.800 ఖరారు చేశారన్నారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం పెంచడంతో స్టేడియంలో ఆడేందుకు ముందుకు రారన్నారు. టీటీని ప్రోత్సహించేందుకు విద్యార్థులకు రూ.200, మిగిలిన వారికి రూ.300 తీసుకునేలా సూచనలు చేయాలని కోరారు. గత 30 ఏళ్లుగా టీటీకి శిక్షకుడు లేరని, యువ ఆటగాళ్లకు మెలకువలు నేర్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరగా శిక్షకుడిని నియమించాలని కోరారు. టీటీ సంస్థలు స్టేడియంలో టోర్నమెంట్లు ఉచితంగా నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని విన్నవించారు.



నితీష్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఉత్సాహంగా ఆయుధ పూజ

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఆయుధాలకు ఉత్సాహంగా పూజలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో తాము వినియోగించే ఉపకరణాలకు బొట్లు పెట్టి పూజలు చేసి నమస్కరించారు. పోలీస్ వాహనాలు, తుపాకులకు చేసిన పూజలో ఎస్పీ పుట్టమాదయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. డీహెచ్‌ఓ కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పురోహితుడితో పూజలు చేయించారు. డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు, సర్వేక్షణాధికారి డాక్టర్ గణేష్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సీనియర్ ఫార్మాసిస్టు జయకుమార్ తదితరులు హాజరయ్యారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను శుభ్రం చేసే దుకాణాల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. శనివారం రాయచూరు నగరసభ ఆధ్వర్యంలో భువనేశ్వరి దేవి ఊరేగింపును కార్యాలయం వద్ద ఒంటి గంటకు నిర్వహించనున్నారు. ఊరేగింపు ముఖ్య వీధుల మీదుగా సాయంత్రం మాణికప్రభు దేవస్థానం వద్దకు చేరుకుంటుంది. ప్రజలందరూ పాల్గొనాలని నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ కోరారు.

బ్యాడ్మింటన్ కోర్టు జాతికి అంకితం

యాదగిరి (రాయచూరు), న్యూస్‌టుడే: యాదగిరి రైల్వేస్టేషన్ దగ్గర్లోని బైపాస్ రహదారి సమీపంలో హోసళ్లి వద్ద నిర్మించిన నాలుగు ఉడన్ బ్యాడ్మింటన్ కోర్టులు, అత్యాధునిక శైలితో నిర్మించిన జిమ్‌ను శనివారం జాతికి అంకితం చేయనున్నారు. రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ, యాదగిరి జిల్లా బాధ్య మంత్రి శరణబసప్ప దర్శనాపూరు దీన్ని ప్రారంభిస్తారు. యాదగిరి, గురుమఠకల్ ఎమ్మెల్యేలు తున్నూరు చెన్నారెడ్డి, శరణగౌడ కందకూర హాజరవుతారని కేకేఆర్ఎస్ నెట్స్, కోర్ట్స్ స్పోర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లీలాకృష్ణ కొల్లిపుర తెలిపారు.

నాగలింగేశ్వరక్యాంపులో వేడుకలు



నాగలింగేశ్వరక్యాంపులో అంబాదేవిని దర్శించుకుంటున్న కె.కరియప్ప తదితరులు

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకుని తాలూకాలోని నాగలింగేశ్వరక్యాంపులో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంబాదేవి విగ్రహాన్ని శుక్రవారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భాజపా నాయకుడు కె.కరియప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతం ప్రజలకు బగళాముఖి సిద్ధపర్వత అంబాదేవి మహాత్మ్యం చాలా గొప్పదని పేర్కొన్నారు. అందుకే ఈ అమ్మవారు అంబామఠంలో మాత్రమే కాకుండా అన్నిచోట్లా భక్తులను అనుగ్రహించేందుకు వివిధ క్యాంపుల్లో దర్శనమిస్తున్నారని కీర్తించారు. శుక్రవారం మహానవమి సందర్భంగా సింధనూరులోని ఆలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.



గాంధీనగర్‌లో మహిషాసురమర్దినిగా



వెంకటేశ్వర పైక్యాంపులో అమ్మవారికి కైంకర్యాలు చేస్తున్న అర్చకులు

రథయాత్రలకు స్వాగతం పలకండి



అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దారు

రాయచూరు, న్యూస్‌టుడే: పట్టణంలోకి 13న ప్రవేశించనున్న కిత్తూరు ఉత్సవ రథయాత్ర, 17న రానున్న 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళన రథయాత్రలకు ఘన స్వాగతం పలకాలని తహసీల్దార్ సురేష్ వర్మ అధికారులకు సూచించారు. యాత్రలకు స్వాగత ఏర్పాట్లపై గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సాహితీవేత్తలు, కన్నడ సంఘాల ప్రతినిధులు, మాతృభాష అభిమానులు, కళాకారులు, విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ఊరేగింపులకు కళా బృందాలను పంపాలని కన్నడ, సాంస్కృతిక శాఖ అధికారిని కోరాలన్నారు. ఘనంగా వీడ్కోలు పలికేందుకు సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశానికి రాయచూరు తాలూకా పంచాయతీ ఈవో చంద్రశేఖర్ పవార్, శిశు అభివృద్ధి శాఖ అధికారి మంజునాథ్, పీయూసీ విద్యా విభాగం అధికారి సోమశేఖర్, తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు హాజరయ్యారు.



పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు

ఠాణాలో ఆయుధపూజ

మాన్వి,న్యూస్‌టుడే: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయదశమిని పురస్కరించుకుని ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. స్టేషన్ పీఐ వీరభద్రయ్య హిరేమఠ ఆధ్వర్యంలో ఆయుధ పూజను సంప్రదాయబద్ధంగా ఆచరించారు. ఎస్సై వీరనగౌడ , ఇతర పోలీసులు పంచె, మహిళా పోలీసులు చీరలతో వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

భక్తిభావనే ముక్తిదాయకం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ప్రతి మనిషిలో భక్తి ఉంటేనే శాంతి, సామరస్యాలు సాధ్యమని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు పేర్కొన్నారు. ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో దసరా మహోత్సవాలు, నవరాత్రి హోమం, మహారుద్ర యాగం, మేధా దక్షిణామూర్తి పూర్ణాహుతి, సరస్వతి హోమాల్లో మంత్రి కేహెచ్ మునియప్ప, సద్గురువు మధుసూదన సాయితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వాసం, అభ్యాసం ఉన్నప్పుడే సామరస్యం, పరమత సహనం అలవడతాయని, అప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని వివరించారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ సత్యసాయి గ్రామంలో తాము తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మధుసూదన సాయి వివరించారు. సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జిల్లాధికారి పీఎన్ రవీంద్ర, స్థానికులు నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పూజలో సద్గురువు మధుసూదన సాయితో మంత్రి కేహెచ్ మునియప్ప

ముప్పు ముంగిట ‘నందికొండ’

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చారిత్రక నంది కొండలపైకి తీగ మార్గం (రోప్‌వే) ఏర్పాటు సరికాదని పర్యావరణ ప్రేమికులు, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు నదుల జన్మస్థానమైన ఆ ప్రాంతానికి కృత్రిమమార్గాలు నిర్మిస్తే పర్యావరణ సమతౌల్యత దెబ్బతిని వయనాడు తరహాలో ప్రమాదాలు సంభవిస్తాయనే ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పర్యావరణవేత్త డాక్టర్ ఏఎన్ యల్లప్పరెడ్డి, గివ్ లైఫ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ భరత్ ఫిషర, దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు సంజనా జాన్, ఆచార్య రేణుకా ప్రసాద్, సీడీ కిరణ్ తదితరులు మాట్లాడారు. నందిబెట్ట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటికే పలు ఆక్రమణలు జరిగాయని తెలిపారు. రోప్‌వే, అనుబంధ పనులతో కొండను కాపాడుకోవడం కష్టమవుతుందని చెప్పారు. రోప్‌వే వద్దని ఇప్పటికే పదకొండు ప్రభుత్వ శాఖలకు వినతిపత్రాలు, నివేదికలు ఇచ్చామన్నారు. నందిబెట్టపై నాలుగుసార్లు విశ్రాంతి తీసుకున్న మహాత్మాగాంధీ ఇది ఆరోగ్య రక్షణ గర్భగుడి అని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. అరకావతి, పాలార్, పెన్నార్, దక్షిణ పెన్నార్, చిత్రావతికి ఈ కొండ జన్మస్థానమని తెలిపారు. వివిధ జంతుజాలం, మొక్కలకు ఆలవాలంగా ఉన్న ఈ కొండను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న పర్యావరణ ప్రేమికులు

తేనెవలలు విసిరి.. నగదు గుంజుడు..

ధార్వాడ: సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారిని తమ తేనెవలల ఉచ్చులో బిగించి, నగదు వసూళ్లకు పాల్పడుతున్న నలుగురిని విద్యాగిరి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఆకాశ, రేణుకా దంపతులు, మల్లిక్ జాన్ నదాఫ్, గజాలా భాను నగరిలను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.14.73 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువులను జప్తు చేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారికి వాట్సప్ నంబరు ఇచ్చి, వీడియో కాల్స్ చేసేవారు. వారి మాట విశ్వసించి వచ్చిన వారితో సన్నిహితంగా ఉండి, రహస్యంగా వీడియో రికార్డింగ్ చేసుకుని, బెదిరింపులకు పాల్పడేవారని విద్యాగిరి ఠాణా పోలీసులు తెలిపారు.

అధికారినంటూ వంచన

ఉడుపి: ప్రధానమంత్రి కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ప్రధాన కార్యదర్శిని అంటూ ఒక వంచకుడు ఉడుపిలో ఆలయం దర్శనాన్ని చేసుకుని వెళ్లాడు. తనను తాను డాక్టర్ ఉదయ్ అనే వ్యక్తి గురువారం ఉదయం పుత్తిగె మఠం దివాన్ నాగరాజ ఆచార్యకు ఫోన్ చేసి, తనను తాను పరిచయం చేసుకున్నాడు. తాను, ఇతర కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం దర్శనానికి వస్తున్నామని, ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరాడు. ఉదయం దర్శనానికి వచ్చిన సమయంలో అతని ప్రవర్తన అనుమానం కలిగినా, అన్ని సదుపాయాలు కల్పించారు. ఉదయ్ వెళ్లిన అనంతరం ప్రధాన మంత్రి వెబ్‌సైటును, దిల్లీకి చెందిన నేతల దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లారు. ఆ పేరుతో ఎవరూ ప్రధాని కార్యాలయంలో పని చేయడం లేదని తెలుసుకుని కంగు తిన్నారు. అతని ఫోన్ నంబరు, కాల్ రికార్డులతో పాటు ఉడుపి ఠాణాలో నాగరాజ ఆచార్య ఫిర్యాదు చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

11-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.94	1615.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	24,490	1020
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	27,406	9,025
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	49.398

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

మాన్వి,న్యూస్‌టుడే: శరన్నవరాత్రి పర్వదిన వేడుకలను మాన్వి, సిరివార తాలూకాల వ్యాప్తంగా క్యాంపుల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారికి శ్రీమహిషాసురమర్దిని అలంకారం చేశారు. మహిళా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శరన్నవరాత్రి వేడుకల్లో నిర్వహణ క్రమంలో దేవాలయాలు భక్తుల తాకిడితో సందడిని సంతరించుకున్నాయి. భక్తులకు సేవా సమితుల ఆధ్వర్యంలో విశేష ప్రసాద వితరణ చేశారు.

‘హుబ్బళ్లి’ కేసుల ఉపసంహరణతో అలజడి

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : పాత హుబ్బళ్లిలో 2022లో జరిగిన ఘర్షణల్లో ఏఐఎంఐఎం నాయకుడు ఆరిఫ్‌తో పాటు పలువురిపై హత్యాయత్నం, మత ఘర్షణల కేసులు నమోదయ్యాయి. దీనికి సంబంధించి 11 ఎఫ్‌ఐఆర్‌లను 155 మందిపై కేసులు నమోదు చేశారు. పాత హుబ్బళ్లి ఠాణా పోలీసులు, వారి వాహనాలపైనా దాడి జరిగింది. ఇప్పుడు ఆ కేసును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భాజపా ఖండించింది.